FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

TGTEL/25/A1964
తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో
ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం,
మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి
మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష
akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :134 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ ఆదివారం- 04 - జనవరి - 2026

# 2025లో భారీ లాభాలిచ్చిన బంగారం, వెండి



2026లోనూ ఈ జోరు కొనసాగుతుందని నిపుణుల అంచనా

బంగారం ధర ఔన్సుకు 5,000 డాలర్లకు చేరే అవకాశం

వెండి ధర ఔన్సుకు 85 డాలర్లకు పెరిగే సూచనలు

సహజ వజ్రాల కన్నా కృత్రిమ వజ్రాలకు పెరుగుతున్న డిమాండ్

గత సంవత్సరం 2025లో బంగారం, వెండిలో పెట్టుబడులు పెట్టిన వారికి కాసుల వర్షం కురిసింది. బంగారం సుమారు 65 శాతం లాభాలను అందించగా, వెండి ఏకంగా 140 శాతానికి పైగా లాభాలను ఇచ్చి చరిత్రాత్మకంగా నిలిచింది. ఇదే సానుకూల ధోరణి 2026లోనూ కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మిగతా..2లో

# చింతపండుతో 'చాకో' - రూ.600 కోట్ల ఆఫర్ వదులుకున్న ఇంజినీర్



చింతపండు గుజ్జుకు పేటెంట్ 17 దేశాలకు ఎగుమతి

సొంత ఊరిలో ఎంఎన్‌సీ కంపెనీ పెట్టాలన్నదే లక్ష్యం

ఢిల్లీ : చిన్నప్పుడు చింతచెట్టు కింద చింతకాయలు ఏరుకోవడం, వాటికి ఉప్పు, కారం అద్ది తినడం అందరికీ మధుర జ్ఞాపకమే. కానీ ఆ జ్ఞాపకాన్ని ఒక ఇంజినీర్ భారీ వ్యాపారంగా మార్చారు. కర్ణాటకలోని బైలహొంగల పట్టణానికి చెందిన గిరీశ్ హలసగి అనే ఇంజినీర్ చింతపండుతో 'చాకో' తయారు చేశారు. దీని కోసం ఆయన ఏకంగా రూ.600 కోట్ల జాబ్ ఆఫర్‌ను తిరస్కరించారు. తొమ్మిదేళ్ల కష్టానికి ఫలితంగా ఇప్పుడు ఆయన తయారు చేసిన 'ఇమ్లీ చాకో'కు పేటెంట్ లభించింది. చింతపండు చాకోకు పేటెంట్ పొందిన 'మొదటి భారతీయుడు'గా గిరీశ్ రికార్డు సృష్టించారు.

రూ.600 కోట్ల ఆఫర్ రిజెక్ట్

గిరీశ్ హలసగి నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంది. మిగతా..2లో

## ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదు



2

- వేలాది మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని
- వేలాది మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి, పాలమూరును నిర్లక్ష్యం చేశారు

- కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం చేసింది బీఆర్ఎస్ పెద్దలే
- పాలమూరు ప్రాజెక్టును కావాలనే నిర్లక్ష్యం చేశారన్న ఉత్తమ్
- ప్రాజెక్టుపై అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్



మిగతాది 2లో

హైదరాబాద్: : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 శాతం నిధులు మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఉత్తమ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్ ) ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్(సమగ్ర ప్రాజెక్టు నివేదిక) సమర్పించిందని ఆయన వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని

## ఎంజీ నరేగాను కొనసాగించాలంటూ తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం

- నరేగాను యథాతథంగా కొనసాగించాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క
- కొత్త చట్టానికి తెలంగాణ వ్యతిరేకమని తెలియజేయాలనే ఈ తీర్మానం చేశామన్న సీఎం



2లో

హైదరాబాద్: ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు గ్రామీణ పేదల జీవితాలను మళ్లీ అస్తవ్యస్తం చేసే ప్రమాదం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్పుల వల్ల గ్రామాల్లో పని దొరకక పేదలు మళ్లీ పట్టణాలకు వలస బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడుతుందని

## గంజాయికి 'నో' చెప్పి భవిష్యత్ సురక్షితం చేసుకోండి



2

- డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు చేసిన కృషి అంతా ఇంతా కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.
- ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ నిర్మూలనపై మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు.
- ఈగల్ పేరుతో ఒక ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి

అభివృద్ధి పనుల కోసం రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు మంజూరు

- కొండగట్టులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక పూజలు
- దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణం
- "అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మ ఇచ్చింది.



అమరావతి : ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలంగాణలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కొండగట్టులో పర్యటించారు. టీటీడీ నిధులతో నిర్మించనున్న భవనాలకు శంకుస్థాపన చేశారు. కూటమి తరపున ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు వెళ్లిన పవన్ స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ అధికారులు, అర్చకులతో మాట్లాడినప్పుడు సుదూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులు వసతి లేక పడుతున్న ఇబ్బందులు ఆయన దృష్టికి తెచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మిగతా..2లో

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభం

- పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికలో వెల్లడైన గణాంకాలు
- దేశంలోని మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి



అమరావతి : పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 2026 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్-డిసెంబర్ 2025) దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో మిగతా..2లో

## బీజేపీని చూసి ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోలేరు



2

- జనసంఘ్, దాని నుంచి వచ్చిన బీజేపీకి ఆర్ఎస్ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని,
- అయితే అవి సంఘ్‌కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని మోహన్ భగవత్ అన్నారు.

# కొండగట్టు అభివృద్ధికి పవన్ కళ్యాణ్ సంకల్పం...

రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో ధర్మశాల,

దీక్ష విరమణ మండపానికి భూమిపూజ...

కొండగట్టు, జనవరి 03(ఆకాంక్ష) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ



2లో



సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం భక్తుల సౌకర్యాల కల్పనలో భాగంగా టీటీడీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కొండగట్టు క్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నప్పటికీ, వసతి, విశ్రాంతి సదుపాయాల లేమితో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దేవాలయ అధికారులు, అర్చకులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా దీక్ష విరమణకు ప్రత్యేక మండపం, విశ్రాంతి గదులతో కూడిన సత్రం అవసరమని వారు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన పవన్ కళ్యాణ్, ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని ఏపీ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన పవన్ కళ్యాణ్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో చర్చలు జరిపారు. ఫలితంగా కొండగట్టు అభివృద్ధి పనుల కోసం రూ.35.19 కోట్ల నిధులు

## మోదీపై కూనంనేని వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి

- వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్య
- అంతర్జాతీయస్థాయిలో దేశం గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అన్న కిషన్ రెడ్డి
- ప్రధానిపై కూనంనేని అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్న కిషన్ రెడ్డి



ఢిల్లి : రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసరమని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానిపై ఆయన చేసిన వ్యాఖ్యలు హేయమైనవని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు శ్రమిస్తూ, అంతర్జాతీయస్థాయిలో భారతదేశ గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అని కొనియాడారు. అలాంటి ప్రధానిపై కూనంనేని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. మిగతా..2లో

తొలి ఆకాంక్ష
TGTEL/25/A1964
తెలుగు సంచలన దిన పత్రిక
ఆదివారం- 04 - జనవరి - 2026

## మొదటి పేజి తరువాయి

## కొండగట్టు అభివృద్ధికి పవన్ కళ్యాణ్ సంకల్పం...

మంజూరు చేసేందుకు టీటీడీ అంగీకరించింది. ఈ నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల నిర్మాణంతో పాటు, ఒకేసారి సుమారు 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించుకునే విధంగా ఆధునిక సదుపాయాలతో కూడిన దీక్ష విరమణ మండపాన్ని నిర్మించనున్నారు. భూమి పూజ అనంతరం పవన్ కళ్యాణ్ నాచుపల్లి శివారులోని బృందావనం రిసార్ట్స్‌కు చేరుకుని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులతో సమావేశం కానున్నారు. అలాగే ఇటీవల జరిగిన తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలుపొందిన అభ్యర్థులతోనూ ప్రత్యేకంగా భేటీ అవుతారు. ఈ సమావేశాలు పూర్తయ్యాక పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు.కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని తన ఇలవేల్పుగా పవన్ కళ్యాణ్ భావిస్తారు.ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం స్వామివారి దర్శనంతో పాటు ఆలయ అభివృద్ధికి ముందడుగు వేయడం భక్తులు, స్థానికుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంటోంది. కొండగట్టు క్షేత్రం మరింత సౌకర్యవంతంగా, భక్తులకు అనుకూలంగా మారే దిశగా ఈ అభివృద్ధి పనులు కీలకంగా నిలవనున్నాయి.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇది ఘనమైన ఆరంభం

ఏపీ ఏకంగా 25.3 శాతం వాటాను దక్కించుకుంది. ఈ విషయాన్ని బ్యాంక్ ఆఫ్ బరోడా తన తాజా ఆర్థిక నివేదికలో వెల్లడించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మేగజైన్ ఓ కథనం వెలువరించింది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు. "ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త, కొత్త సంవత్సరానికి ఘనమైన ఆరంభం. మా ముందుచూపుతో కూడిన విధాన సంస్కరణల ప్రభావాన్ని, ప్రత్యేకించి, సకాలంలో మరియు పారదర్శకంగా ప్రోత్సాహకాల పంపిణీ కోసం ఎస్క్రో-ఆధారిత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం, అలాగే స్పష్టమైన, రంగాల వారీ విధానాలను ప్రవేశపెట్టడం వంటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' కార్యక్రమాల ప్రభావాన్ని ఇది ప్రతిబింబిస్తుంది" అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంపై నమ్మకముంచి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన ఇన్వెస్టర్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఈ తొమ్మిది నెలల్లో దేశవ్యాప్తంగా మొత్తం రూ.26.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ తర్వాత ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ మూడు రాష్ట్రాలు కలిపి దేశంలోని మొత్తం పెట్టుబడి ప్రతిపాదనల్లో 51.2 శాతం వాటాను ఆకర్షించడం గమనార్హం.

## గంజాయికి 'నో' చెప్పి భవిష్యత్ సురక్షితం చేసుకోండి

శ్రీకాకుళం, జనవరి3 : గంజాయి కేసుల్లో దొరికితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. చిన్న చిన్న సరదాలకు పిల్లల జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. ఇవాళ(శనివారం) శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. 501 గ్రామాలు, సుమారు 1300 కిలోమీటర్ల మేర పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయ సైకిల్ యాత్ర జరిగిందని తెలిపారు. ఇటీవల ఇండిగో సంక్షోభాన్ని హ్యాండిల్ చేయలేదని రామ్మోహన్ నాయుడుపై ఆరోపణలు వచ్చాయని ప్రస్తావించారు. కానీ వారం రోజుల్లో ఆయన పరిస్థితిని పరిష్కరించారని చెప్పుకొచ్చారు. ఆ వారం రోజులు ఆయన పడిన కష్టం తనకు తెలుసునని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు చేసిన కృషి అంతా ఇంతా కాదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ నిర్మూలనపై మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దాని కోసం ఈగల్ అని ఒక ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశామని వెల్లడించారు హోంమంత్రి అనిత.జీరో నుంచి మొదలు పెట్టి గంజాయి నిర్మూలన చేశామని తెలిపారు. ఇబ్బందిగా ఉంటుందని తెలిసినా చాలా విషయాల్లో పిల్లలకు డ్రగ్స్‌పై నో చెప్పడం రాదని అన్నారు. నో చెప్పడం మొదలు పెడితే మార్పు కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. ఏపీలో అడుగడుగునా గంజాయి తనిఖీలు జరిగాయని తెలిపారు. తాము పని చేస్తే సరిపోదని.. పిల్లల్లో కూడా అవగాహన రావాలని అన్నారు. పిల్లలు వారి భవిష్యత్‌ని సన్మార్గంలో పెట్టుకోవాలని కోరారు. ఎవరి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంటుందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## మోదీపై కూనంనేని వ్యాఖ్యలు..
## తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి

ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనాన్ని బయటపెట్టాయని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కూనంనేని వంటి వారు చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయకుండా, సభా మర్యాదలు పాటించేలా చొరవ తీసుకోవాలని కిషన్ రెడ్డి సభాపతిని కోరారు. కాగా, కూనంనేని సాంబశివరావు శాసనసభలో మాట్లాడుతూ, మోదీ మైండ్‌ను టెస్ట్ చేయించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## 2025లో భారీ లాభాలిచ్చిన బంగారం, వెండి

ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ గుజరాత్ అధ్యక్షుడు నైనేష్ పచ్చిగర్, ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది కూడా బంగారం, వెండి జోరు కొనసాగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. బంగారం ధరల భవిష్యత్తుపై వివరిస్తూ, "ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర ఔన్సుకు 4,300 డాలర్ల వద్ద ఉంది. ఇది 5,000 డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉంది" అని పచ్చిగర్ పేర్కొన్నారు. దీని ప్రకారం ప్రస్తుత ధరల నుంచి 16 శాతానికి పైగా పెరిగే ఆస్కారం ఉందని ఆయన తెలిపారు. వెండికి కూడా మంచి అవకాశాలు ఉన్నాయని, దాని ధర ప్రస్తుతమున్న 70 డాలర్ల నుంచి 85 డాలర్లకు పెరగవచ్చని అంచనా వేశారు. అంటే వెండిలో దాదాపు 20 శాతం అదనపు లాభాలకు వీలుందని సూచించారు. మరోవైపు వజ్రాల మార్కెట్ గురించి మాట్లాడుతూ, తక్కువ ధరల కారణంగా సహజ వజ్రాల కంటే ల్యాబ్-గ్రోన్ డైమండ్స్‌కు (కృత్రిమ వజ్రాలకు) ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు. రాబోయే కొన్నేళ్లపాటు ఇదే ధోరణి కొనసాగవచ్చని, అయితే మూడు, నాలుగేళ్ల తర్వాత సహజ వజ్రాలకు తిరిగి డిమాండ్ పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రపంచవ్యాప్త అనిశ్చితి, అమెరికా టారిఫ్ ఆందోళనలు, ప్రధాన దేశాల మధ్య భౌగోళిక ఉద్రిక్తతలే 2025లో బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నువామా ప్రొఫెషనల్ క్లయింట్స్ గ్రూప్ కూడా మధ్యలో ధరల స్థిరీకరణ ఉన్నప్పటికీ ఈ రెండు లోహాల బుల్లిష్ ట్రెండ్ కొనసాగుతుందని అంచనా వేసింది.

## ఆటో డ్రైవర్లను అక్రమంగా
## అరెస్టు చేయడం సరికాదు

హైదరాబాద్: హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల ఐకాస నేతలు, వేలాది మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని ఆరోపించారు. వేలాది మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని ప్రశ్నిస్తే, నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలు, ఆటో అన్నలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన ఇవాళ అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే.. వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని కేటీఆర్ స్పష్టం చేశారు

## ఎంజీ నరేగాను కొనసాగించాలంటూ
## తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం

ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో ఆనాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని సీఎం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీకి ప్రత్యామ్నాయంగా కేంద్రం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్(గ్రామీణ (వీబీజీరామ్‌జీ)'ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని శుక్రవారం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో నుంచి గాంధీ పేరును తొలగించడంతో పాటు పలు కీలక మార్పులు చేస్తూ కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం తిరస్కరిస్తోందని స్పష్టం చేస్తూ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. ఉపాధి హామీ చట్టంపై, దానిలోని సాధకబాధకాలపై ఈ సభలో విస్తృతంగా చర్చ జరిగింది. తీర్మానంపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తీసుకొచ్చిన కొత్త చట్టానికి తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకమని స్పష్టంగా తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఈ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పేద కూలీకి సంవత్సరానికి వంద రోజుల ఉపాధి కల్పించడమే ఈ పథక ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత 20 ఏళ్లుగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన వారిలో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని వెల్లడించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి

**మొదటి పేజి తరువాయి**

ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడారు. "అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మ ఇచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ నాకే ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. టీటీడీ సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యం, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కొన్నేళ్ల క్రితం ప్రచారం చేస్తున్న సమయంలో పవన్ కల్యాణ్ తీవ్ర విద్యుదాఘాతానికి గురి కావడంతో కొండగట్టు అంజన కృప వల్లే ప్రమాదం నుంచి బయటపడ్డానని పవన్ కల్యాణ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ ఎన్నికల ముందు వారాహి వాహనంతో



వాహన పూజ చేయించి ఇక్కడి నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 2024 ఏపీ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జూన్ 29 మరోసారి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎం హోదాలో తొలిసారి అంజన్నను దర్శించుకున్న పవన్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో అభివృద్ధి పనులకు పవన్ ప్రతిపాదించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడుతో చర్చించారు. కొండగట్టు అభివృద్ధి పనుల కోసం రూ.35.19 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపడతారు. ఆలయం అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం తెలంగాణ జనసేన నాయకులు, శ్రేణులతో పవన్ సమావేశం అయ్యారు. 'కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. విద్యుత్ ప్రమాదం నుంచి ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. భక్తుల కోసం కోరుకున్న బలమైన సంకల్పమిది. ఆంజనేయస్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కలగడం మా అదృష్టం. గిరిప్రదక్షిణకు నా వంతు సహకారం అందిస్తా. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొత్త ఏడాది ఆంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ప్రార్థిస్తున్నా.' - ఉపముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ "కొండగట్టులో కార్యక్రమాల కోసం టీటీడీ బోర్డుకు లేఖ రాశారు. లేఖను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తే వెంటనే ఆమోదించారు. బోర్డు సమావేశంలో చర్చించి వెంటనే అనుమతులిచ్చాం. టీటీడీ ఆధ్వర్యంలో మరిన్ని పనులు చేయబోతున్నాం" అని బీఆర్ నాయుడు తెలిపారు.

# బీజేపీని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థం చేసుకోలేరు

**మొదటి పేజి తరువాయి**

భోపాల్: యూనిఫాం, శారీరక వ్యాయామాలు ఉన్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (పారామిలటరీ సంస్థ కాదని, బీజేపీని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే అది పెద్ద పొరపాటని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. సమాజాన్ని ఏకం చేయడం, భారతదేశం మరోసారి విదేశీ శక్తుల గుప్పిట్లోకి వెళ్లకుండా అవసరమైన లక్షణాలు, సద్గుణాలను నింపడానికి ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. 'మేము యూనిఫాం ధరిస్తాం. కవాతులు, కర్రలతో ఎక్సర్‌సైజ్‌లు చేస్తాం. ఇది చూసి మమ్మల్ని ఎవరైనా పారామిలటరీ సంస్థ అనుకుంటే పొరపడినట్టే. సంఘ్ ఒక విలక్షణ సంస్థ. సంఘ్‌ను అర్థం చేసుకోవడం కష్టం' అని భగవత్ అన్నారు. జన్‌సంఘ్, దాని నుంచి వచ్చిన బీజేపీకి ఆర్‌ఎస్‌ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని, అయితే అవి సంఘ్‌కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని అన్నారు. ఇవాళ ప్రజలు సరైన సమాచారం కోసం లోతుగా వెళ్లడం లేదని, మూలాలకు వెళ్లరని, వికీపీడియాకు వెళ్తుంటారని, అయితే అక్కడి సమాచారం అంతా నిజం కాదని పేర్కొన్నారు. ఎవరైతే సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారో వారికే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఇలాంటి అపోహల రీత్యా ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న భగవత్ తెలిపారు. స్వయం సేవకులకు సంఘ్ తీర్చిదిద్దుతుందని, భారతదేశ పరమ వైభవం కోసం పనిచేసేందుకు విలువలు, ఆలోచన, లక్ష్యాలను పెంపొందిస్తుందని, రిమోట్ ద్వారా నియంత్రించదని భగవత్ వివరించారు. దేశభక్తి వాతావరణాన్ని నిర్మించే కార్మికులను సృష్టించడానికి సంఘ్ తన శాఖల ద్వారా పనిచేస్తుందన్నారు. సంఘ్ అనేది ఒక ప్రతిచర్యగా పుట్టిందనే సాధారణ భావన ఉందని, అయితే అది నిజం కాదని చెప్పారు. సంఘ్ దేనికీ ప్రతిచర్య, వ్యతిరేకం కాదని, సంఘ్ ఎవరితోనూ పోటీ పడటం లేదని అన్నారు. దేశంపై మొదటగా దండెత్తిన వాళ్లు బ్రిటిషర్లు కాదని, భారతీయుల కంటే తక్కువ స్థాయిలో ఉన్న కొందరు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మనలను ఓడించారని చెప్పారు. ఇది ఏడుసార్లు జరిగిందని, ఎనిమిదవ ఆక్రమణదారులు ఆంగ్లేయులని వివరించారు. అలాంటప్పుడు స్వాతంత్ర్యానికి హామీ ఏమిటి? ఇది పదే పదే ఎందుకు జరుగుతోందో మనం ఆలోచించాలని భగవత్ సూచించారు. మనను మనం అర్థం చేసుకుని స్వార్థానికి అతీతంగా ఎదగాలని, సద్గుణాలతో సమాజం ఏకతాటిపై నిలిస్తే దేశానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాజకీయ బానిసత్వానికి



తెరపడినా, మానసిక బానిసత్వం కొంతవరకూ కొనసాగుతోందన్నారు. దానికి చరమగీతం పాడాలన్నారు. స్వదేశీ అంటే ప్రపంచంతో వాణిజ్యాన్ని తగ్గించుకోవడం కాదని, భారతదేశంలో తయారుకాని మందులు వంటి ముఖ్యమైన వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని అన్నారు. వాణిజ్యం అనేది ఒత్తిడి, సుంకాల భయంతో జరక్కూడదని, సొంత నిబంధనల ప్రకారమే జరగాలని సూచించారు.

# వెనెజువెలా అధ్యక్షుడు మదురోను కస్టడీలోకి తీసుకున్నాం

**మొదటి పేజి తరువాయి**

### భారీ వైమానిక దాడులు

అమెరికా వెనుజువెలా భారీ వైమానిక దాడులు చేసింది. శనివారం తెల్లవారు జామున 2 గంటలకు ఆ దేశ రాజధాని కరాకస్? పరిసర ప్రాంతాల్లోని ఏడు చోట్ల భారీ పేలుళ్లు జరిపింది. తరువాత వెనుజువెలా దేశాధ్యక్షుడిని, అతని భార్యను కస్టడీలోకి తీసుకుంది. అమెరికాకు చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్ చేపట్టింది. అయితే ఈ దాడులకు ముందు తమ పౌరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అమెరికా ఫెడరల్? ఏవియేషన్? అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్?ఏఏ) వెనెజువెలా గగనతలంలో అమెరికా పౌర విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. అమెరికా దళాల దాడుల వల్ల కరాకస్? నగరంలోని కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రజల భయాందోళనలతో వీధుల్లోకి వస్తున్నారు. మరికొన్ని చోట్ల మదురో మద్దతుదారులు నిరసనలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికా దేశ వ్యవహారాల్లో యూఎస్? నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే మొదటిసారి.

### సామ్రాజ్యవాద దాడులు

శనివారం కరాకస్?లోని లా కార్లోటా ఎయిర్?ఫీల్డ్?, ఫ్యూర్టే లియునా మిలిటరీ బేస్?, లా గ్వైరా నౌకాశ్రయం మొదలైన కీలక సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. అయితే ఈ దాడులను వెనెజువెలా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్? ఖండించారు. ఇది 'సామ్రాజ్యవాద దాడి'గా అభివరి?ంచారు. దేశ



రక్షణ కోసం విదేశీ బలగాలను ఎదురించాలని పౌరులకు పిలుపునిచ్చారు.

### దాడులను ఖండించిన రష్యా

వెనెజువెలాపై అమెరికా చేసిన దాడులను రష్యా, ఇరాన్?, కొలంబియా ఖండించాయి. స్పానిష్ ప్రభుత్వం ఘర్షణలను ఆపేందుకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. "వెనెజువెలాపై అమెరికా వైమానిక దాడులు సైనిక దురాక్రమణ కిందకే వస్తాయి. విధ్వంస చర్యలకు తావులేకుండా, విదేశీ సైనిక జోక్యం లేని విధంగా వెనెజువెలా తన సొంత భవితను నిర?యించుకునే హక్కు ఉండాలి. పరిస్థితి మరింత దిగజారకుండా సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి. వెనెజువెలా ప్రజలకు, ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది. ఈ విషయమై ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం."

**- రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ**

### ఇంతకీ అమెరికా ఎందుకు దాడి చేసింది

నికోలస్ మదురో అమెరికాలో 'నార్కో టెర్రరిజం' (మత్తు పదార్థాల అక్రమ రవాణా) చేస్తున్నారని ట్రంప్ ఆరోపణలు చేస్తోంది. అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్? మార్కో రూబియో అయితే, మదురోను అమెరికాకు తరలించి, అక్కడ క్రిమినల్? విచారణ చేయిస్తామని ప్రకటించారు.

### అమెరికా దురాక్రమణలు!

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడైన తరువాత అంతర్జాతీయ వ్యవహారాల్లో చాలా దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ దేశాలను టారిఫ్?ల పేరుతో బెదిరించారు. వీటికి లొంగని భారత్?, చైనా లాంటి దేశాలపై టారిఫ్?లు భారీగా పెంచుతూ ఇబ్బంది పెడుతున్నారు. మరోవైపు తమకు అవసరమైన ప్రాంతాలను క్రమంగా ఆక్రమించుకునే లేదా నియంత్రణలోకి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ భద్రతా అవసరాలు అని పేర్కొంటూ గ్రీన్?ల్యాండ్?ను? విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక యూఎస్?-కెనడా మధ్య ఓ కృత్రిమ రేఖను గీసి, ఆయా ప్రాంతాలను ఆక్రమించాలని చూస్తున్నారు. పనామా కాలువను కూడా స్వాధీనం చేసుకోవాలని చూశారు. కొంతకాలం క్రితం పనామాపై దాడిచేసి మిలటరీ నేత మాన్యుయెల్ నోరిగాను పదవీచ్యుతుడిని చేశారు. తాజాగా వెనుజువెలాపై భీకరదాడులకు పాల్పడ్డారు. దీనితో పక్కదేశమైన కొలంబియా అప్రమత్తమైంది. తమ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి, పాలమూరును నిర్లక్ష్యం చేశారు

**మొదటి పేజి తరువాయి**

ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు(బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో) పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారన్నారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే మళ్లీ ఆఫ్ చేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిందని, కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి పాలమూరును నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. పాలమూరు అంచనాలు 1.5 టీఎంసీ నుంచి 1 తగ్గించారు : కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారన్నారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేదని వివరించారు. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ ను రూపొందించారని బీఆర్ఎస్ పై మండిపడ్డారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారన్నారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేదన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లమన్నారు. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగిందని తెలిపారు. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. 'కృష్ణానదీ జలాల నీటి కేటాయింపుల విషయంలో గత ప్రభుత్వాల కంటే చాలా సమర్థవంతంగా నీటి హక్కులను కాపాడాం. 2014 -2023 వరకు అధికారంలో ఉన్నవాళ్లు కృష్ణానదీ జలాలపై తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయి, మిగిలిన నీటిని ఆంధ్రప్రదేశ్ కు 512 ఇవ్వాలని లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఘనత వారికే దక్కింది. మా ప్రభుత్వంలో రాబోవు మూడేళ్లలో కల్వకుర్తి, కృష్ణా బేసిన్ లో అన్ని ప్రాజెక్టులు మూడేళ్లలో పూర్తిచేస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు 90వేల కోట్లు ఖర్చుపెట్టి, పాలమూరుకు మాత్రం 20వేల కోట్లే ఖర్చుచేశారు"- ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు : తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. పనులను నిలిపివేయించామన్నారు. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో అధిక నీటిని వాడుకున్నామని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల(ఇరిగేషన్) ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు వ్యయం



చేశారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉందన్న ఆయన తమ ప్రభుత్వం వచ్చాక 550 టీఎంసీలు నీరు కావాలని వాదించామన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ ప్రక్రియ పెండింగ్‌లో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. ఏపీ తరలిస్తుంటే చూస్తూ కూర్చున్నారు : ఆంధ్రప్రదేశ్ సర్కారు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం చూస్తూ కూర్చుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించిందని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదని మండిపడ్డారు.

ఆయన రిటైర్డ్ టీచర్ మహదేవప్ప, వీరమ్మ దంపతుల కుమారుడు. 2002లో బాగల్‌కోట్‌లోని బసవేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో బీఈ (ఇండస్ట్రియల్ ప్రొడక్షన్) పూర్తి చేశారు. గిరీశ్ ఎస్-ఎస్ఎల్సీ, పీయూసీ, ఇంజినీరింగ్‌లో టాపర్‌గా నిలిచారు. 2013-14లో ఆయన ప్రతిభను గుర్తించిన ఒక కంపెనీ ఏకంగా రూ.600 కోట్ల ఆఫర్ ఇచ్చింది. కానీ గిరీశ్ ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. 'నా టాలెంట్ నా సొంత ఊరికి ఉపయోగపడాలి. రూ.600 కోట్లు పెద్ద మొత్తమే కావచ్చు. కానీ నా కల రూ.1000 కోట్లు సాధించడం' అని ఆయన బలంగా నిర్ణయించుకున్నారు.

9 ఏళ్ల శ్రమ, పేటెంట్ విజయం

గిరీశ్ తన ప్రయాణాన్ని సాదాసీదాగా మొదలుపెట్టలేదు. చింతపండుకు తగిన గుర్తింపు రావడం లేదని గ్రహించి, 2016లో పరిశోధనలు ప్రారంభించారు. దాదాపు నాలుగున్నరేళ్లు ప్రయోగాలు చేశారు. చింతపండు, ఉప్పు, మిరియాలు, బెల్లం, జీలకర్ర వంటి

## చింతపండుతో 'చాకో' - రూ.600 కోట్ల ఆఫర్ వదులుకున్న ఇంజినీర్

సహజ పదార్థాలతో 'చాకో' తయారు చేసే విధానాన్ని కనిపెట్టారు. ఇందుకోసం దాదాపు రూ.60 లక్షలు అప్పు చేశారు. 2021లో పేటెంట్ కోసం దరఖాస్తు చేయగా, 2025 ఏప్రిల్ 25న అధికారికంగా పేటెంట్ లభించింది.

చింతపండుతో 'చాకో' (జుం దీప్తుతీఫ్)

చాక్లెట్‌లా ఆకర్షణీయమైన ప్యాకింగ్

సాధారణంగా చింతపండు గుజ్జును పుల్లలకు చుట్టి అమ్ముతారు. కానీ గిరీశ్ దాన్ని మార్చేశారు. 'ఇమ్లీ చాకో'ను చిన్న చిన్న బాక్సుల్లో, రంగురంగుల అల్యూమినియం ఫాయిల్స్‌లో చాక్లెట్‌లా ప్యాక్ చేశారు. ఇది చూడగానే పిల్లలను, పెద్దలను ఆకర్షిస్తోంది. ఎగ్జిబిషన్లలో పిల్లలు ప్రేమగా 'చాకో అంకుల్' అని పిలుస్తుంటారు.

చింతపండుతో 'చాకో'

17 దేశాలకు ఎగుమతి

గిరీశ్ తయారు చేసిన ఈ దేశీ ఉత్పత్తి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరింది. అమెరికా, ఇంగ్లండ్, ఇటలీ, కెనడా, రష్యా, ఆస్ట్రేలియా, జర్మనీ సహా మొత్తం 17 దేశాలకు వీటిని ఎగుమతి చేస్తున్నారు. విదేశాల్లో ఉండే భారతీయులు ఇక్కడికి వచ్చినప్పుడు వీటిని భారీగా కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లోనూ దీనికి మంచి డిమాండ్ ఉంది. పేటెంట్ వచ్చిన తర్వాత డిమాండ్ మరింత పెరిగిందని గిరీశ్ తెలిపారు.

మహిళలకు ఉపాధి

వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యతను కూడా గిరీశ్ నెరవేరుస్తున్నారు. 'ఆశా హోమ్ ఎంప్లాయ్‌మెంట్'

# సంపాదకీయం

## భారత్ భావనకు 'విద్వేష' ఉపద్రవం

నూతన సంవత్సర శుభాకాంక్షలు. గతించిన సంవత్సరం (2025)లో మీ మనసుపై ముద్ర వేసిన ప్రభావం లేదా ఘటన ఏమిటి? శాశ్వతంగా నిలిచిపోయే దాని జ్ఞాపకాన్ని సువ్యక్తం చేసే పదం ఏమిటి? ఈ సువిశాల దేశంలో అత్యధిక ప్రజలను కదిలించిన మాట ఏమిటి? 2025 సంవత్సరం మనలో మిగిల్చిన మన్నికైన జ్ఞాపకం 'సిందూర్'. పహల్గాంలో అమానుష ఉగ్రవాద దాడికి పాల్పడింది ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు. ఈ పాకిస్థానీ దుండగులకు ఆశ్రయమిచ్చి, వారి ఘాతుకానికి సహకరించినది ఇద్దరు భారతీయులు అని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వెల్లడించింది. పహల్గాం హత్యాకాండకు భారత ప్రభుత్వ ప్రతిస్పందనే 'ఆపరేషన్ సిందూర్'. ఈ సైనిక చర్యలో భారత వాయుసేన, క్షిపణులు, డ్రోన్‌లు పాకిస్థాన్ సైనిక స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించాయి. మన దేశానికీ కొంత నష్టం సంభవించింది (ఏ యుద్ధంలోనైనా ఇది అనివార్యం). ముగ్గురు పాకిస్థానీ చొరబాటుదారులు ఒక ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఎన్ఐఏ అరెస్ట్ చేసిన ఇద్దరు భారతీయుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఆపరేషన్ సిందూర్ నిర్వహణ, సాధించిన ఫలితాలపై ఇప్పటికీ పారదర్శకత కొరవడింది. కేవలం నాలుగు రోజులు మాత్రమే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' దేశ ప్రజల మనసులపై శాశ్వత ప్రభావం కలిగించేంత సుదీర్ఘ యుద్ధం కాదు. 2025లో భారత్‌ను నిర్వచించేందుకు యుక్తమైన మరో పదం 'టారిఫ్'. ఆ సేతు హిమాచలం అశేష ప్రజల మాటామంతీ, పిచ్చాపాటీలో ప్రస్తావితమైన, ఇంకా ప్రస్తావితమవుతోన్న పదమది. దానికి దీటైన మరొక పదం 'ట్రంప్' మాత్రమే! ట్రంప్ టారిఫ్‌లు అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలను సంక్లిష్ట సమస్యల్లోకి నెట్టివేశాయి. చాలా దేశాల్లో ఈ సమస్యలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఉదాహరణకు అమెరికాకు భారత్ ఎగుమతులపై ప్రతీకార సుంకాలు, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు జరిమానా విధింపులు కొనసాగుతున్నాయి. అమెరికాకు భారత్ చేస్తున్న ఉక్కు, అల్యూమినియం, జౌళి ఉత్పత్తులు, ముత్యాలు, ఆభరణాలు, సముద్ర ఆహార ఉత్పత్తులు, రసాయనాల ఎగుమతులను ట్రంప్ సుంకాలు ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా, భారత్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం 'సమీప భవిష్యత్తు'లో కుదరనున్నదని 2025 ఏప్రిల్‌లో వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ ప్రకటించారు. 2025 సంవత్సరం ముగిసిపోయింది. ఇప్పటికీ ఆ ఆశావహ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చాలా సుదూర విషయంగానే కనిపిస్తోంది మరి. జీఎస్టీ (వస్తుసేవల పన్ను) మరొక యుక్తమైన పదంగా చెప్పవచ్చు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఈ పన్ను వ్యవస్థ ప్రారంభమయింది. వినియోగదారులకు, వ్యాపార వర్గాలకు అదొక ఉపద్రవం. సముచిత సలహాలు, సూచనలకు కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానే అయినప్పటికీ సానుకూలంగా ప్రతిస్పందించింది. చాలా సరుకులు, సేవలపై జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించింది. అయినప్పటికీ వర్తకులు, వ్యాపారులు, వాణిజ్యవేత్తలకు పాలనా యంత్రాంగాల నుంచి వేధింపులు, చికాకులు తప్పడం లేదు. కొంతమంది వ్యాపారులు అయితే ఇప్పటికీ జీఎస్టీ విషయంలో తికమక పడుతూనే ఉన్నారు. జీఎస్టీ చట్టాలకు అనుగుణంగా వ్యవహరించడంలో తమకు ఎదురవుతున్న కష్ట నష్టాలకు వర్తకులు, వ్యాపారులు ఎంతో మంది గుండెలు బాదుకుంటూనే ఉన్నారు. కొన్ని ముఖ్యమైన సరుకులపై పన్ను రాయితీ కల్పించారు. అయితే వాటి వినియోగ పరిమాణంతో పోల్చితే ఆ రాయితీ చాలా స్వల్పమైనది మాత్రమే. జీఎస్టీపై ఇచ్చిన రాయితీలతో వినియోగం ఇతోధికంగా పెరుగుతుందని ప్రభుత్వం భావించింది. అయితే దేశ జనాభాలో అధిక ఆదాయమున్న పదిశాతం ప్రజల వినియోగం మాత్రమే పెరిగింది. చెప్పవచ్చిన దేమిటంటే జీఎస్టీ ఇప్పటికీ సామాన్య వినియోగదారులకు చికాకు కలిగిస్తూనే ఉన్నది. 2025 సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థకు '' స్థిరమైన, మితమైన వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం, తక్కువ నిరుద్యోగంతో ఆర్థిక వ్యవస్థ వర్ధిల్లిన అరుదైన సంవత్సరం) అని ప్రభుత్వం ఆర్భాటంగా చాటింది. అయితే ఈ ప్రచారార్భాటం చాలా త్వరితంగానే అంతరించిపోయింది. ఆ ఘనమైన మాటగోల్డిలాక్స్ ఇయర్' సూచించే విషయాలు విద్యాధికులకే అపరిచితమైనవి. దీనికి తోడు దేశ జాతీయ గణాంకాల విశ్వసనీయతను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ప్రశ్నించింది. దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనతల గురించి మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు మొదలు అర్థశాస్త్ర ఘనాపాఠీలు అయిన విశ్వవిద్యాలయాల ఆచార్యుల వరకూ ఎందరో మాట్లాడారు. అయితే ఉద్యోగాలకై యువజనులు చేసిన ఆందోళనలతో ప్రభుత్వ ప్రాయోజిత 'గోల్డిలాక్స్ ఇయర్' ప్రచారం నిలిచిపోయింది. నిజానికి ప్రధాన ఆర్థిక మాజీ సలహాదారు, తదితరులు చెబుతున్న వాటికంటే చాలా బలహీనతలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఉన్నాయి. వాటిని అంగీకరించేందుకు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇంకా చెప్పాలంటే... బహుశా, ఆ బలహీనతలను అర్థం చేసుకునేందుకు సైతం ప్రభుత్వం నిరాకరిస్తోంది. సరే, ఒకప్పుడు అందరూ 'లౌకికవాదం' అనే పదాన్ని ప్రస్తావిస్తుండేవారు. లౌకికవాద విలువల గురించి మాట్లాడుతుండేవారు. అయితే ఇప్పుడు ఆ పదం ఎక్కడా విన్పించడం లేదు. తమనుతాము లౌకికవాదులుగా చెప్పుకునే వారి సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది. రాజ్య వ్యవస్థ కార్యకలాపాల నుంచి మత ప్రమేయ వ్యవహారాలను వేరు చేయడమే లౌకికవాదం. అయితే మత సిద్ధాంతాలపై కాకుండా హేతువు, మానవతావాదంపై లౌకికవాది విలువలు ఆధారపడి ఉంటాయనే అర్థాన్ని ఆ పదం కాలక్రమేణా సంతరించుకున్నది. లౌకికవాద విలువల, విశ్వాసాల తిరోగమనం విద్వేషం ప్రబలిపోయేందుకు దారితీసింది. ప్రతి మతమూ గర్హించిన మానవ స్వభావమది. విద్వేష ప్రసంగాలు, విద్వేష రచనలుగా చెప్పదగినవాటిలో అత్యధికం మతం ఆధారితమైనవి.

# ప్రకృతి హెచ్చరిస్తోంది... వింటున్నారా?

భారతదేశంపై వాతావరణ మార్పుల ప్రభావం ఏడాదికేడాది ఉద్ధృతమవుతోంది. నిరుడు జనవరి నుంచి నవంబరు వరకు 334 రోజులు ఉంటే, వాటిలో 331 రోజులపాటు దేశంలో ఎక్కడో ఒకచోట తుపానులు, వరదలు, అధిక ఉష్ణోగ్రతలు, మట్టిపెళ్లలు విరిగిపడటం వంటివి ఎక్కువగా సంభవించాయి. వీటి దెబ్బకు మొత్తం 4,419 మంది ప్రాణాలు కోల్పోగా, 4.3 కోట్ల ఎకరాల్లో పంటలు నాశనమయ్యాయి. ఇలాంటి విపత్తుల కట్టడికి అంతర్జాతీయ సమాజంతో కలిసి భారత్ తక్షణమే గట్టి చర్యలకు పూనుకోవాలి. నిరుడు దేశవ్యాప్తంగా వడగాడ్పులు కల్లోలపరిచాయి. ఏప్రిల్-జూన్ మధ్య దిల్లీతోపాటు దేశంలో అనేక చోట్ల పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటాయి. ఆ సమయంలో, సహజంగా శీతల వాతావరణం ఉండే హిమాచల్‌ప్రదేశ్ సహా 19 రాష్ట్రాల్లో భానుడి భగభగలు 990 మంది ప్రాణాలను బలిగొన్నాయి. ఇది 2024లో సంభవించిన మరణాలకన్నా మూడు రెట్లు అధికం! వేసవి మండుటెండలు ముగిశాక వర్షాకాలంలో వరదలు, మట్టిపెళ్లలు విరిగిపడటం వల్ల 2,707 మంది మరణించారు. దేశమంతటా పిడుగుపాట్లు, ఉరుములూ మెరుపులతో కూడిన తుపానుల వల్ల మరో 1,500 మంది దుర్మరణం పాలయ్యారు. వాయవ్య భారతం నిరుడు 311 రోజులపాటు ప్రకృతి ప్రకోపాలకు లోనైంది. హిమాచల్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 1,459 మరణాలు సంభవించాయి. దక్షిణ భారతంలో అత్యధికంగా ఏపీలో 608 మరణాలు చోటుచేసుకోగా, మధ్యప్రదేశ్‌లో 537, ఝార్ఖండ్‌లో 478 మంది చనిపోయారు. ప్రకృతి ఉత్పాతాల వల్ల మహారాష్ట్రలో 8.4లక్షల హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. మొంథా వంటి తుపానులు ఆంధ్రప్రదేశ్‌కు రూ.5,300 కోట్ల నష్టం కలిగించాయి. ఉత్తరాఖండ్‌లో మెరుపు వరదలు 90 మందిని బలిగొన్నాయి. 50మంది గల్లంతయ్యారు. మొత్తంగా విపత్తుల వల్ల 1,81,459 ఇళ్లు నేలమట్టం కాగా, 77,189 పశువులు మరణించాయి.

### గతి తప్పిన రుతువులు

విపత్తుల వల్ల నిరుడు దేశంలో చాలామంది జీవనాధారం దెబ్బతినిపోయింది. అనేక కుటుంబాలు మానసిక కుంగుబాటుకు లోనయ్యాయి. ఈ నష్టం వెలకట్టలేనిది. బిహార్‌లో మెరుపులు, పిడుగుల వల్ల 250 మంది మరణించారు. ఆకస్మిక వరదల వల్ల పంటలు కోల్పోయిన 80శాతం వ్యవసాయ కుటుంబాలు జీవిక కోసం పంజాబ్, దిల్లీలకు వలసవెళ్లక తప్పలేదు. వీటికితోడు మాదక ద్రవ్యాల సేవనం, మనుషుల అక్రమ రవాణా వంటివీ సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. కలుషిత వరద నీరు వ్యాధులకు దారితీసి, ఆస్పత్రులు కిక్కిరిసిపోయాయి. 54లక్షల మంది నిర్వాసితులయ్యారు. వారిలో అత్యధికులు స్త్రీలూ పిల్లలే. 2050కల్లా 4.5 కోట్ల మంది ప్రకృతి ప్రకోపాల వల్ల నిర్వాసితులవుతారని అంచనా. భారతదేశానికి 1993 నుంచి 2022 వరకు 18వేల కోట్ల డాలర్ల నష్టం సంభవించింది. వాతావరణ మార్పుల వల్ల భారీగా నష్టపోయిన దేశాల్లో భారత్‌ది ఆరో స్థానం. సముద్ర జలాలు వేడెక్కడం వల్ల అరేబియా సముద్రంలో 40శాతం అధిక తీవ్రతతో తుపానులు పుట్టుకొచ్చాయి. వాటివల్ల భారీగా పంటనష్టం సంభవించింది. భవన నిర్మాణం కోసం చెరువులను



పూడ్చేసిన నగరాల్లో వరదలు భారీ నష్టాన్ని మిగిల్చిన సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలి. వాతావరణ మార్పులతో ఎండలు మండిపోవడం, చలి తీవ్రత పెరుగుతున్నాయి. వాయవ్య, మధ్య భారత రాష్ట్రాల్లో వసంత రుతువు కనుమరుగైంది. ఏప్రిల్‌లో అకాల వర్షాలకు జమ్మూకశ్మీర్, సిక్కింలలో మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. శీతాకాలంలోనూ ఉష్ణతాపం కొనసాగడంతో నేల నెర్రెలు చాస్తోంది. సముద్రాలు వేడెక్కి దక్షిణ సముద్ర తీరం దెబ్బతింటోంది. మహాసముద్రాలు దశాబ్దానికి 0.12 సెంటిగ్రేడ్ మేర వేడెక్కుతున్నాయి. సముద్ర మట్టాలు ఏటా 3.3 మిల్లీమీటర్ల చొప్పున పెరుగుతున్నాయి. నిరుడు జనవరి-సెప్టెంబరు మధ్యకాలంలో 270 రోజులపాటు ప్రకృతి చిర్రుబుర్రులాడింది. 2024లో అలాంటి రోజులు 255 కాగా, 2022లో అవి 241 రోజులే! అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాతావరణ మార్పులు బూటకమంటూ చమురు, బొగ్గుల తవ్వకాలను మరింత ముమ్మరం చేస్తున్నారు. దీనివల్ల వాతావరణ వైపరీత్యాలు మరింత తీవ్రం కానున్నాయి. భారత్ ఎదుర్కొంటున్న సమస్యలే ఇతర వర్ధమాన దేశాలనూ పీడిస్తున్నాయి. కాబట్టి, వాతావరణ మార్పులను తట్టుకోవడానికి సంపన్న దేశాలు ఇస్తామన్న నిధులూ సాంకేతికతలను వర్ధమాన దేశాలు రాబట్టుకోవాలి.

### ఉదాసీనంగా ఉంటే అంతే!

ప్రకృతి ఉత్పాతాలను తప్పించుకోవాలంటే- ముందు బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని కట్టిపెట్టి పూర్తిగా పునరుత్పాదక ఇంధనాలకు మారాలి. 2030కల్లా కర్బన ఉద్గారాలను కనీసం 45శాతం మేర తగ్గించుకోవాలి. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారానే 50శాతం విద్యుత్తును ఉత్పత్తి చేయడం, వాతావరణం నుంచి కర్బనాన్ని విడగొట్టే సాంకేతికతలను చేపట్టడం వంటివి విధిగా జరగాలి. అడవుల నరికివేత, చెరువుల పూడ్చివేత వంటి అకృత్యాలను అరికట్టి తీరాలి. ముఖ్యంగా ఈశాన్య భారత అడవులను కాపాడుకోవాలి. హిమనీనదాలు కరిగిపోకుండా జాగ్రత్తపడాల్సి ఉంది. దుర్భిక్షాన్నీ అతివృష్టినీ తట్టుకునే పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు, ప్రకృతి ప్రకోపాల గురించి రైతులను ముందుగానే అప్రమత్తం చేసే సాంకేతికతలనూ విరివిగా వినియోగించాలి. అన్నదాతలు, వలసదారులు, నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. ప్రకృతి వైపరీత్యాలకు అలవాటుపడటం తప్ప, మనం చేసేదేమీ లేదనే ఉదాసీనతను వదిలించుకోవాలి. 'కాప్-30' శిఖరాగ్ర సభ హరిత వాతావరణ నిధిని ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. దాని కింద ప్రతి దేశం వాతావరణ మార్పుల నిరోధ విధానాన్ని రూపొందించి, పక్కాగా అమలు చేయాలి. ఈ విషయంలో భారత్ ఇతర దేశాలకు మార్గదర్శిగా నిలవాలి.

# రెండు పార్టీల కనికట్టు.. నీటిహక్కుల తాకట్టు

నీరు ప్రాథమిక అవసరం. జీవ మనుగడకు మూలం. ప్రతి పౌరుడికీ అందివ్వడం పాలకుల ప్రాథమిక బాధ్యత. అది రాజ్యాంగ హక్కు. దేశంలోని రాష్ట్రాలన్నీ అందుకోసమే తహతహలాడుతున్నాయి. చుక్క చుక్కను ఒడిసిపట్టేందుకు ప్రణాళికలను రూపొందించుకొని ముందుకుసాగుతున్నాయి. రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా రాష్ట్ర జలహక్కుల రక్షణ, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే ప్రథమ లక్ష్యంగా చేసుకుని ప్రజాప్రతినిధులు, మేధావి వర్గాలు కలిసికట్టుగా అడుగులు వేస్తున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణానికి వడి వడిగా పరుగులు తీస్తున్నాయి. నీటిహక్కుల రక్షణకు మూకుమ్మడిగానే కాలుదువ్వుతున్నాయి. అదే సమయంలో భేషజాలకు పోకుండా నీటి వినియోగ సామర్థ్యాలను అంతకంతకూ రెట్టింపు చేసుకుంటున్నాయి. పొరుగున ఉన్న కర్ణాటక సర్కారు అందుకు నిలువెత్తు నిదర్శనం. అప్పర్‌తుంగా, అప్పర్‌భద్ర ప్రాజెక్టులను చేపట్టేందుకు ఆ రాష్ట్రం సిద్ధమైంది. ఆల్మట్టి ఎత్తు పెంపునకు, దానికి సమాంతరంగా నావలి రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకుంటున్నది. అవిగాక చిన్నపాటి చెక్‌డ్యామ్‌లను చేపడుతున్నది. మరోవైపు చిన్న రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ మరో సజీవ సాక్ష్యం. గోదావరిలో ఆ రాష్ట్ర వాటాకు చెందిన 148 టీఎంసీల జలాలను తాత్కాలికంగానే కావేరికి తరలిస్తామని కేంద్రం చెప్తున్నా ఒప్పుకోబోయేది లేదని తెగేసి చెప్తున్నది. హడావుడిగా బోధ్‌ఘాట్ ప్రాజెక్టును తెరమీదికి తీసుకువచ్చింది. కేంద్రంలో, ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నది బీజేపీ ప్రభుత్వాలే కావడం గమనార్హం. ఇక మహారాష్ట్ర సైతం అనేక ఇంట్రారివర్ లింకు ప్రాజెక్టులను చేపట్టేందుకు సిద్ధమైంది. ఇక తెలంగాణ పొరుగునే ఉన్న ఏపీ సైతం మరో ప్రబల సాక్ష్యం. అనుమతులతో పనిలేకుండా, అవార్డులను పట్టించుకోకుండా, పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలను పట్టించుకోకుండా కృష్ణా, గోదావరిపై ఇబ్బడి ముబ్బడిగా ప్రాజెక్టులను అనాదిగా చేపడుతున్నది. తాజాగా పోలవరం-నల్లమలసాగర్‌ను చేపట్టేందుకు వడి వడిగా పావులు కదుపుతున్నది. సూటిగా చెప్పాలంటే ఒడిషా, తమిళనాడు ఏ రాష్ట్రంలోనూ సాగునీటి ప్రాజెక్టులపై రాజకీయపార్టీలు పరస్పర కక్ష సాధింపులకు దిగిన దాఖలా లేదు. రాజకీయ ఆరోపణలకు, లేదంటే విధానపరమైన విమర్శలకు పరిమితమయ్యాయే తప్ప కేసులు వేసి, కమీషన్లను పెట్టి, రచ్చకీడ్చి ప్రాజెక్టులను పడావు పెట్టిన చరిత్ర కనబడదు. నీటి వనరులను ఒడిసిపట్టడమే ఏకైక లక్ష్యంగా ఆయా రాష్ట్రాల్లో పార్టీలు విజ్ఞతతో పురోగమిస్తున్నాయి. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ ప్రస్తుత రాజకీయ ఏలికల ఆలోచనా సరళి అత్యంత హేయంగా ఉన్నది. వారు అనుసరిస్తున్న విధానాల్లో రాజకీయ ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పూర్తిగా మృగ్యం. ఉమ్మడి రాష్ట్రంలో.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రతిపక్ష హోదాలో.. నేడు అధికారపక్షంగానూ అవలంబిస్తున్న, అమలుచేస్తున్న ప్రణాళికలే ఇందుకు నిదర్శనం. ఇంకా అదే ఉమ్మడి పాలనలో నాటి భావదారిద్ర్యం. నాడు వలసాంధ్ర పాలకులు చేసిన జలకుట్రలను ఏనాడూ అవగాహన చేసుకోలేదు. ప్రశ్నించలేదు. నదీ జలాలు దక్కకూడదనే దురాలోచనతో నీళ్లురాని చోట, కనీస నీటి నిల్వ సామర్థ్యం లేకుండా తెలంగాణ ప్రాజెక్టులను ప్రతిపాదించినా నిలదీయలేదు. సీమాంధ్ర ప్రాజెక్టులకు నిధుల వరదపారిస్తూ.. తెలంగాణ ప్రాంత ప్రాజెక్టులకు నిధులివ్వకుండా.. అంతర్రాష్ట్ర వివాదాల్లోకి నెట్టి పడావుబెట్టినా పట్టించుకోలేదు. దౌర్జన్యంగా ఆర్డీఎస్‌ను బద్దలుకొట్టి.. పోతిరెడ్డిపాడును విస్తరించి నీళ్లను దోచుకెళ్లినా కిక్కురుమనలేదు. నోరు విప్పలేదు. పదవులకు, కాల్వల కాంట్రాక్టుల పనులకు కమీషన్లను దండుకునేందుకు పోటీపడ్డ నేతలే తప్ప న్యాయమైన నీళ్ల వాటా కోసం నిక్కచ్చిగా నిలబడ్డదీ లేదు. ఒక్కరూ కలబడిందీ లేదు. కాంగ్రెస్ నేతల ఆ పాపఫలమే కదా కృష్ణమ్మ, గోదారమ్మ ఏండ్లుగా తెలంగాణ బీళ్లను తడపకుండానే, ఈ



గడ్డపై నిలువకుండానే దిగువకు పరుగుపెట్టాయి. తుంగభద్ర నడిగడ్డను కన్నెత్తిచూడకుండానే తరలిపోయింది. భీమా ఏ ధీమాను ఇవ్వలేకపోయింది. వెరసి కరువులకు, ఆకలికి, వలసలకు తెలంగాణ నిలయమైంది. తెలంగాణ వాకిలి పొక్కిలైంది. జీవన విధ్వంసానికి గురైంది. కష్కెడు నీళ్లకు సైతం తండ్లాడింది. ఇదేమీ యుగాల కిందటి చరిత్ర కాదు. పన్నెండేండ్ల కిందటి తెలంగాణ బతుకుచిత్రం, చేదు వాస్తవం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరమైనా కాంగ్రెస్ నేతల తీరు మారింది లేదు. రాజకీయాలే తప్ప విశాల తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఉమ్మడి పాలకులు జల కుట్రలను ఛేదించేందుకు అకుంఠిత దీక్షతో కేసీఆర్ పూనుకుంటే, పొరుగు రాష్ట్రాలకు వంతపాడుతూ, రాష్ట్ర నీటి హక్కులను పణంగా పెడుతూ అడుగడుగునా అడ్డునిలిచే ప్రయత్నమే చేశారు. తెలంగాణ సోయితో.. భావి తెలంగాణ నీటి అవసరాలపై కచ్చితమైన అంచనాలతో.. కృష్ణా, గోదావరిలో న్యాయమైన వాటాల మేరకు జలాలను వినియోగించుకోవాలనే లక్ష్యంతో.. చుక్క చుక్కను ఒడిసిపట్టి.. తెలంగాణ మూలమూలకూ పారించాలనే సదాశయంతో ప్రాజెక్టుల రీడిజైన్‌ను చేపడితే నిందలేశారు. నీళ్లు లేని చోట ప్రతిపాదించిన ప్రాజెక్టులను సమృద్ధిగా నీళ్లున్న చోటుకు మార్చితే తప్పుబట్టారు. వరద వచ్చిన సమయంలోనే, అతితక్కువ కాలంలోనే ఎక్కువ నీళ్లను ఎత్తిపోసుకునేందుకు వీలుగా పెద్ద పంపులను పెడితే కమీషన్లను అంటగట్టేందుకు యత్నించారు. తెలంగాణ భౌగోళిక అవసరాలకనుగుణంగా, నీటిరంగ నిపుణుల సూచనల మేరకు నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు భారీ రిజర్వాయర్లను నిర్మిస్తే రైతులను ఎగదోసి అడ్డుకునేందుకూ యత్నించి విఫలమయ్యారు. చచ్చినోళ్ల పేరిట ప్రాజెక్టులపై కేసులు వేసి అభాసుపాలయ్యారు. ప్రతిపక్షంగా ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని డిమాండ్ చేయడం మాని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం.. సీతమ్మసాగర్, డిండి, గౌరవెల్లి, మల్లన్నసాగర్ పనులను అడ్డుకునేందుకు కోర్టుల్లో దావాలు వేసి తెలంగాణను దగా చేసేందుకు సైతం తెగించారు. చెరువులు తవ్వినా, పూడిక తీసినా, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం తలపెట్టినా రాద్ధాంతం. కాళ్లలో కట్టెలు పెట్టే రాజకీయం. ఇదే కాంగ్రెస్ అనుసరించిన విధానం. దశాబ్దాల పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చిన కేసీఆర్‌ను పదేండ్లలో ఏనాడూ మాటవరుసకైనా ప్రశంసించిన పాపాన పోలేదు కాంగ్రెస్ నేతలు. సూటిగా చెప్పాలంటే పొరుగు రాష్ట్రాల కన్నా ఎక్కువగా రాష్ట్ర ప్రాజెక్టులను తెలంగాణ కాంగ్రెస్ నేతలే బద్నాం చేయ పూనుకోవడం అత్యంత విచారకరం. తెలంగాణకు విషాదకరం. పార్టీ ఏదైనా కానీ, అధికారంలోకి వచ్చాక తీరు మారాలె. రాజకీయాలు వేరు. ప్రభుత్వం వేరు. రాష్ట్ర ప్రయోజనాలు, భవిష్యత్ తరాల బాధ్యత మోస్తున్నామనే భావనతో మెలగాలె. విజ్ఞతను ప్రదర్శించాలె. వివేకంతో వ్యవహరించాలె. వివేచనతో అడుగులు వేయాలె. కాలం మారినా కాంగ్రెస్‌లో ఇప్పటికీ ఆ సోయి కానరాకపోవడమే విషాదకరం. ఉమ్మడి పాలకుల కుట్రపూరిత ప్రణాళికలే భేష్ అంటూ కీర్తించడమే కాదు, వాటినే అనుసరిస్తుండటమే కాంగ్రెస్‌కు తెలంగాణ సోయి లేదనే సత్యాన్ని పట్టిచూపుతుంది. కాంగ్రెస్ భావదారిద్ర్యానికి, వదిలిపోని బానిస తత్వానికి అద్దం పడుతుంది. రేవంత్ సర్కారు గత రెండేండ్లుగా అనుసరిస్తున్న విధానాలు, సాగునీటి ప్రణాళికలే అందుకు నిలువెత్తు నిదర్శనం. అధికార పగ్గాలను చేతబట్టిన వెంటనే కాళేశ్వరంపై కక్షసాధింపులు మొదలయ్యాయి. శ్వేతపత్రాల పేరిట రాద్ధాంతాలు, కమిషన్లు, విజిలెన్స్ ఎంక్వయిరీలు.. నివేదికల పేరిట తెలంగాణ కల్పతరువైన ప్రాజెక్టును మూలకునెట్టింది. ఎదురెక్కిన గోదావరిని మళ్లీ ఏపీకి సద్దికడుతున్నది. దిగువకు పారకం పెడుతున్నది. మరోవైపు ఏపీ జల దోపిడీకి అడ్డుచక్రం వేసేందుకు.. తెలంగాణకు నీటిభరోసా కల్పించేందుకు చేపట్టిన పాలమూరు లిఫ్ట్‌నూ నిర్లక్ష్యం చేస్తున్నది. పనులను పూర్తిచేసి కృష్ణమ్మను ఒడిసిపట్టే అవకాశం ఉన్నా రెండేండ్లుగా పడావు పెడుతున్నది. కృష్ణా జలాల దోపిడికి కొమ్ముకాస్తున్నది. ప్రాజెక్టు కాల్వల టెండర్ల రద్దు, భీమా నీటి కోటాలో కోతలు, గ్రావిటీని కాదని.. ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ప్రణాళికలన్నీ తారుమారు చేశారు. ఆయకట్టు కుదింపులు, తొలగింపులు, చెక్‌డ్యామ్‌ల పేల్చివేతలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఉన్న ఆయకట్టుకే నీరివ్వలేని జూరాలపై కొడంగల్ లిఫ్ట్ పేరిట అదనపు భారం మోపే అనాలోచిత నిర్ణయాలే ఉదాహరణలు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులే లేవని ప్రభుత్వ పెద్దలే కోడై కూస్తూ కుట్రలకు అస్త్రాలు అందించడమే కాంగ్రెస్ సోయిలేని తనానికి దర్పణం. తెలంగాణ దౌర్భాగ్యం. ఇక రాష్ట్రంలో బీజేపీ నేతలదీ అదే తీరు. 'మీ అందరికీ ఒకటే విజ్ఞప్తి.

# ఉప్పు కయ్యల్లో సిరుల సాగు

ఉప్పు అనగానే సాధారణంగా వంటలే గుర్తొస్తాయి. అయితే, పారిశ్రామికంగానూ ఉప్పు వినియోగం పెరుగుతోంది. ఈ క్రమంలో ఇండియా పెద్దమొత్తంలో విదేశాలకు ఉప్పును ఎగుమతి చేస్తోంది. అదే సమయంలో సంబంధిత పరిశ్రమలో పనిచేస్తున్నవారి సంరక్షణకూ పలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చైనా, అమెరికాల తరవాత ఉప్పు ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలుస్తోంది. 1947లో దేశంలో ఉప్పు ఉత్పత్తి 19 లక్షల టన్నులుంటే, 2022-23 నాటికి అది 3.91 కోట్ల టన్నులకు పెరిగింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశీయ అవసరాలకు యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి ఉప్పును దిగుమతి చేసుకునేవాళ్లం. నేడు ఉప్పు ఉత్పత్తిలో ఇండియా స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా మిగులు ఉప్పును విదేశాలకు ఎగుమతి చేస్తోంది. 2023-24లో దాదాపు 44 కోట్ల డాలర్ల విలువైన 1.44 కోట్ల టన్నుల ఉప్పును విదేశాలకు పంపించింది. ప్రపంచ ఉప్పు ఎగుమతుల్లో మన వాటా సుమారు పది శాతం. 2030 నాటికి విశ్వవ్యాప్తంగా ఉప్పు మార్కెట్ విలువ 4,860 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ క్రమంలో రాబోయే రోజుల్లో అందివచ్చే ఎగుమతి అవకాశాలను ఇండియా అందిపుచ్చుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా పెరిగిన గిరాకీ

భారత్‌లో సముద్రపు నీరు, ఉప్పునీటి సరస్సులు, భూగర్భ, రాతి నిక్షేపాలు ఉప్పు ఉత్పత్తికి ప్రధాన వనరులు. దేశవ్యాప్తంగా దాదాపు



7.47 లక్షల ఎకరాల్లో ఉప్పు సాగవుతోంది. వేల సంఖ్యలో ఉత్పత్తిదారులున్నారు. దేశీయ ఉప్పు ఉత్పత్తిలో గుజరాత్ 87.4శాతం వాటాతో అగ్రభాగాన నిలుస్తోంది. తమిళనాడు (4.7శాతం), రాజస్థాన్ (6.7శాతం)లు తరవాతి స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, పశ్చిమ్ బెంగాల్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, డామన్ డయ్యూలలోనూ ఉప్పు ఉత్పత్తి అవుతోంది. దేశంలో ఏటా మానవ వినియోగానికి సగటున 74 లక్షల టన్నులు, పారిశ్రామిక వినియోగానికి సుమారు 125 లక్షల టన్నుల ఉప్పు అవసరమవుతోంది. పారిశ్రామికంగా పెరిగిన డిమాండు దృష్ట్యా చైనా, జపాన్, ఆగ్నేయ ఆసియా దేశాలకు మన ఉప్పు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. మొత్తం వంద దేశాలకు మన ఉప్పు వెళ్తోంది. అయోడైజ్డ్ ఉప్పు, రాతి ఉప్పు, హిమాలయన్ పింక్ సాల్ట్‌లను సహజంగా వంటల్లో వాడతారు. అంతే కాకుండా రసాయన, తోలు, గాజు, ప్లాస్టిక్ పరిశ్రమల్లో, క్లోరిన్, సోడాయాష్, కాస్టిక్ సోడా తయారీలోనూ ఉప్పును వినియోగిస్తారు. రహదారులపై మంచును కరిగించడానికీ ఉప్పు తోడ్పడుతుంది. ఈ క్రమంలో శీతల దేశాలకూ ఉప్పు ఎగుమతి అవుతోంది. ఆక్వా పరిశ్రమలోనూ దాని వినియోగం అధికమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని 974 కిలోమీటర్ల తీర ప్రాంతంలో దాదాపు 20 వేల ఉప్పు కొఠారులు ఉన్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా నౌపడ, చినగంజాం, ఇస్కపల్లి, కాకినాడ, కృష్ణపట్నం తదితర ప్రాంతాల్లో ఉప్పు ఎక్కువగా ఉత్పత్తి అవుతోంది. జనవరి నుంచి జూన్ వరకు పంటకాలం ఉంటుంది. 'ఆంధ్రప్రదేశ్ ఉప్పుగిన్నె'గా శ్రీకాకుళం జిల్లాలోని నౌపడ ప్రసిద్ధి చెందింది.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉప్పు పరిశ్రమలో వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. అయితే, ఉప్పు కొఠారులకు వెళ్లడానికి సక్రమమైన రహదారులే చాలా చోట్ల కనిపించవు.

## వైద్య సదుపాయాలు లేక నిండు గర్భిణీ మృతి....



గడ్చిరోలి,**ఆకాంక్ష జనవరి 03:** మారుమూల గ్రామంలో కనీస వైద్య సదుపాయాలు లేకపోవడం మరో ప్రాణాన్ని బలి తీసుకుంది. ప్రసవం కోసం భర్తతో కలిసి ఆరు కిలోమీటర్ల దూరం అటవీ దారిలో నడిచిన నిండు గర్భిణీ చివరకు ప్రాణాలు కోల్పోయిన హ ృదయ విదారక సంఘటన మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో చోటుచేసుకుంది. ఆల్దండి తోలా గ్రామానికి చెందిన 24 ఏళ్ల ఆషా సంతోష్ కిరంగ తొమ్మిది నెలల గర్భవతి. గ్రామంలో డెలివరీ సదుపాయాలు లేకపోవడం ప్రధాన రహదారికి సరైన రోడ్డు మార్గం కూడా లేకపోవడంతో ఆమె ప్రసవం కోసం పెథాలోని తన సోదరి ఇంటికి వెళ్లాలని నిర?యించుకుంది. జనవరి 1న భర్తతో కలిసి అటవీ దారిలో సుమారు ఆరు కిలోమీటర్ల దూరం నడిచి పెథాకు చేరుకుంది.అయితే అక్కడికి చేరేసరికి ఆమె ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా క్షీణించింది. జనవరి 2న పురిటి నొప్పులు తీవ్రమవడంతో అంబులెన్స్‌లో హెడ్రిలోని కాళీ అమ్మల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు తక్షణమే సిజేరియన్ ఆపరేషన్ అవసరమని తెలిపారు. అయితే అప్పటికే ఆలస్యం కావడంతో గర్భంలోని శిశువు మ ృతి చెందింది. అనంతరం రక్తపోటు తీవ్రంగా పెరగడంతో ఆషా కూడా చికిత్స పొందుతూ మ ృతి చెందింది.ఈ విషాద ఘటనపై వైద్యాధికారులు దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయాల లేమి, రవాణా సౌకర్యాల కొరత కారణంగా అమాయకుల ప్రాణాలు పోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో తక్షణ చర్యలు తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో ప్రసవ సదుపాయాలు రహదారి కనెక్టివిటీ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మహిళల విద్యకు దిశానిర్దేశం చేసిన వీర వనిత సావిత్రిబాయి పూలే....

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్...





మెదక్, **ఆకాంక్ష జనవరి 03:** మహిళల విద్యాభివృద్ధికి జీవితాంతం అంకితమై క ృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే అని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులతో కలిసి ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మహిళలకు, ఆడబిడ్డల చదువు కోసం సావిత్రిబాయి పూలే చేసిన విశేష సేవలను స్మరించుకుంటూ ప్రతి ఏటా జనవరి 3న అధికారికంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి సమాజంలో ప్రతి వ్యక్తికి, ముఖ్యంగా మహిళలకు చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పిన వీర వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.సమాజ చైతన్యం విద్య ద్వారానే సాధ్యమవుతుందని ఆమె స్పష్టంగా నిరూపించారని, మహిళలు విద్యను అభ్యసించి ఉపాధ్యాయులుగా మారి అనేక రంగాల్లో చరిత్రలో తమదైన స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు.విద్య ద్వారా ఎన్నో మహిళామణులు ఉపాధ్యాయులుగా ఎదిగి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల చదువు, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన సావిత్రిబాయి పూలే మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని తెలిపారు. ఎన్నో త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, ఆ స్వాతంత్ర్యాన్ని సార్థకం చేసేది విద్యేనని అన్నారు.సమాజ చైతన్యంలో మహిళల భాగస్వామ్యాన్ని గుర్తు చేస్తూ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మహిళా ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై బీఆర్ఎస్ ఆందోళన...

### జోగు రామన్న అరెస్ట్‌తో ఉద్రిక్తత...




ఆదిలాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నిర్వహించిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జోగు రామన్న నేత ృత్వంలో పార్టీ శ్రేణులు శుక్రవారం భారీగా సమీక ృతమయ్యారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యే నివాసాల ముట్టడికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు ముందస్తుగా అప్రమత్తమై ఆందోళనకారులను అడ్డుకున్నారు. జోగు రామన్నతో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు నిలువరించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఒకరినొకరు నెట్టుకోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఆందోళన కొనసాగుతుండటంతో పోలీసులు జోగు రామన్నను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించేందుకు వాహనంలో ఎక్కించారు. అయితే దీనికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో మరోసారి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయి దాటకుండా పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దింపి ఆందోళనకారులను చెదరగొట్టారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈ ఆందోళన నిర్వహించామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. పోలీసులు మాత్రం శాంతిభద్రతల పరిరక్షణ కోసమే చర్యలు తీసుకున్నామని తెలిపారు.



## మధిరలో అరాచక పాలన....

### భట్టి విక్రమార్కపై సీపీఎం తీవ్ర ఆరోపణలు...

ఖమ్మం,**ఆకాంక్ష జనవరి 03:** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా అరాచక పాలన కొనసాగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్రంగా ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సీపీఎం కలిసి ఎక్కువ స్థానాలు గెలుచుకోవడాన్ని జీర?ంచుకోలేక కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క పోలీసులతో కుమ్మక్కై సీపీఎం కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు.మధిర నియోజక వర్గంలో అధికార దుర్వినియోగం రోజురోజుకూ పెరుగుతోందని, ప్రజలు ప్రశ్నిస్తే బెదిరింపులు, తప్పుడు కేసులు పెట్టడం ద్వారా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని జాన్ వెస్లీ అన్నారు. గ్రామ స్థాయిలో సీపీఎం నాయకులు, కార్యకర్తలపై నిరంతర వేధింపులు జరుగుతున్నాయని, ప్రజా సమస్యలపై పోరాడితే అక్రమంగా పోలీస్ స్టేషన్లకు పిలిపించి కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు.పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, రాజకీయ కక్షతో ప్రతిపక్షాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఓటమిని సహించలేక అధికార పార్టీ నేతలు ప్రతీకార రాజకీయాలకు దిగుతున్నారని ఆరోపించారు. పోలీసు యంత్రాంగాన్ని రాజకీయ ఆయుధంగా మార్చడం తీవ్రంగా ఖండనీయమని స్పష్టం చేశారు. సీపీఎం కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, మధిర నియోజకవర్గంలో కొనసాగుతున్న అరాచక పాలనకు ముగింపు పలకాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం సీపీఎం పోరాటాన్ని మరింత ఉధ ృతం చేస్తుందని హెచ్చరించారు.

# హైదరాబాద్‌ను గూగుల్ మ్యాప్‌తో విభజిస్తున్నారా...?

### సికింద్రాబాద్ చరిత్రను నాశనం చేసే కుట్ర...
### ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూడండి...
### రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తలసాని సంచలన ఆరోపణలు




హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** హైదరాబాద్ మహానగరాన్ని ఇష్టారాజ్యంగా విభజించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.గూగుల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానందతో కలిసి తలసాని మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.హైదరాబాద్,సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత ఉందని ఆయన గుర్తుచేశారు. అలాంటి సికింద్రాబాద్‌ను ఎలాంటి టెక్నికల్ స్టడీ లేకుండా, ఇష్టమొచ్చినట్లు విభజించడం దుర్మార్గమని మండిపడ్డారు. జంట నగరాల ఉనికినే లేకుండా చేసేలా కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్ర, సంస్క ృతిని నాశనం చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు.ఈ విభజనకు వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తలసాని ప్రకటించారు. తమకు మద్దతు ఇచ్చే పార్టీలన్నింటితో కలిసి నిరసనలు నిర్వహిస్తామని తెలిపారు. సికింద్రాబాద్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూపాలని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.మహానగర విభజన అంశంపై కాంగ్రెస్ నాయకులకు కనీస అవగాహన కూడా లేదని తలసాని విమర్శించారు. డివిజన్లను కూడా సరిగ్గా విభజించలేకపోయారని అన్నారు. 24 నియోజకవర్గాలు ఉన్న మహానగరాన్ని విభజిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం బీఆర్ఎస్ హయాంలో 150 డివిజన్లు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నగరాన్ని ఇష్టమొచ్చినట్లు ముక్కలు చేస్తూ ప్రజలను ప్రభుత్వ పనుల కోసం నగరం మొత్తం తిరిగే పరిస్థితికి నెట్టుతోందని మండిపడ్డారు. ఈ అంశంపై చట్టపరంగా, న్యాయ పరంగా పోరాడతామని స్పష్టం చేశారు.అసెంబ్లీలోనూ ఇష్టారాజ్యంగా వ్యవహారం కొనసాగుతోందని తలసాని ఆరోపించారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు, స్పీకర్లను చూశామని, కానీ ఇలాంటి ముఖ్యమంత్రి, స్పీకర్‌ను ఎప్పుడూ చూడలేదని అన్నారు. స్పీకర్ కనీసం ప్రతిపక్ష సభ్యుల వైపు చూడటం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడటం ప్రతిపక్ష హక్కు అని, కానీ ప్రతిపక్షాన్ని నిలువరిస్తున్నారని మండిపడ్డారు. గంటన్నర పాటు సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను స్పీకర్ అడ్డుకోలేదని ఆరోపించారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా ప్రభుత్వానికి వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన లేదని, అందరి అభిప్రాయాలు తీసుకుంటామని చెబుతూనే అభిప్రాయం చెప్పకుండా అడ్డుకుంటున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు.

## ముఖ్యమంత్రి సమాధానం లేకుండా అడ్డగోలు ప్రసంగం...

### పవర్ పాయింట్‌పై కాంగ్రెస్ ద్వంద్వనీతిని ఎండగట్టిన బీఆర్ఎస్...
### ప్రతిపక్షానికి అవకాశం లేక పోవడంతో అసెంబ్లీ బహిష్కరణ...
### ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలాంటి అవమానాలు లేవు: వేముల ప్రశాంత్ రెడ్డి వ్యాఖ్యలు




హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** తెలంగాణ శాసనసభలో స్పీకర్ పక్షపాత వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో సుదీర్ఘ ప్రసంగాలు చేయడం శాసనసభ చరిత్రలో ఎప్పుడూ లేనిదని, నిబంధనలకు విరుద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంటన్నర పాటు మాట్లాడడం ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచినట్లేనని విమర్శించారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని చెబుతూనే మూసీ ప్రక్షాళనకు వేల కోట్ల రూపాయలు ఎలా ఖర్చు చేస్తారని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నిస్తే, దానికి సమాధానం చెప్పాల్సిన ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి గంటన్నర పాటు బీఆర్ఎస్ సభ్యులపై అసభ్య వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ అడ్డు చెప్పకుండా, ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.ప్రతిపక్షానికి కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వడం లేదని, ముఖ్యమంత్రి తప్పులను ఎత్తిచూపేందుకు మైక్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వనని స్వయంగా స్పీకర్ చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మైక్ ఇవ్వని అసెంబ్లీకి వెళ్లి ఏం లాభమని నిలదీశారు. బీఆర్ఎస్ సభ్యులకు మాట్లాడే అవకాశం లేకపోవడంతోనే అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని కోరారు.తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2016లో శాసనసభలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ సభ్యులు సభను బహిష్కరించారని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ శాసనసభ నిబంధనలకు విరుద్ధమని అప్పట్లో కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క స్పీకర్‌కు ఉత్తరం రాసి సంతకాలు చేశారని వెల్లడించారు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇస్తుండటం ద్వంద్వనీతికి నిదర్శనమని ఆరోపించారు.అప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డి కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వ్యతిరేకించారని గుర్తుచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ మళ్లీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడానికి సిద్ధమవుతుండటం ఆశ్చర్యకరమని అన్నారు. బీఆర్ఎస్‌కూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని స్పీకర్‌కు ఉత్తరం రాసినట్లు తెలిపారు. బీఆర్ఎస్‌కు పీపీటీ అవకాశం కల్పిస్తే సభకు హాజరవుతామని స్పష్టం చేశారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా అసెంబ్లీలో ఇలాంటి అవమానాలు జరగలేదని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అసెంబ్లీలో తెలంగాణ వాదాన్ని గట్టిగా వినిపించామని తెలిపారు. గతంలో శాసనసభకు కాలిన మోటార్లు, ఎండిన వరి పైరులు తీసుకెళ్లి రైతుల సమస్యలను నేరుగా పాలకుల ద ృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షం అవసరమని ప్రతిపక్ష స్వరాన్ని అణిచివేస్తే ప్రజల గొంతు నొక్కినట్లేనని హెచ్చరించారు.

## గోవిందరాజస్వామి ఆలయంలో భద్రతా వైఫల్యం...

### మద్యం మత్తులో గోపురం ఎక్కిన వ్యక్తి, మూడు గంటల పాటు హైడ్రామా...



తిరుపతి, **ఆకాంక్ష జనవరి 03:** తిరుపతి జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో భద్రతా లోపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. ఏకాంత సేవ ముగిసిన అనంతరం ఆలయ సిబ్బంది కళ్లుగప్పి ఓ వ్యక్తి ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించి కలకలం రేపాడు. మద్యం మత్తులో ఉన్న ఆ వ్యక్తి ఆలయ గోడ దూకి లోపలికి వెళ్లి, మహాద్వారం లోపల ఉన్న గోపురంపైకి ఎక్కి అరుస్తూ కలశాలను లాగేందుకు యత్నించాడు.ఈ ఘటనను గమనించిన టీటీడీ విజిలెన్స్ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది అతడిని కిందకు దిగాలని పలుమార్లు సూచించినా అతడు వినిపించుకోలేదు. తనకు మద్యం బాటిల్ ఇస్తేనే కిందకు దిగుతానని పట్టుబట్టి దాదాపు మూడు గంటల పాటు హైడ్రామా స ృష్టించాడు.పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఫైర్ సిబ్బంది నిచ్చెన సాయంతో గోపురంపైకి ఎక్కి ఆ వ్యక్తిని బలవంతంగా కిందకు దించారు. అనంతరం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో ఆలయ గోపురంపై ఉన్న కలశాలు, విద్యుత్ దీపాలకు స్వల్ప నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆలయంపైకి ఎక్కిన వ్యక్తిని నిజామాబాద్ జిల్లాకు చెందిన తిరుపతిగా గుర్తించారు. అతడు మద్యం మత్తులో ఉండటంతో పాటు మానసిక స్థితి సరిగా లేదని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఈస్ట్ డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు.పవిత్ర క్షేత్రంలో ఇటువంటి ఘటన జరగడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావ ృతం కాకుండా భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని భక్తులు కోరుతున్నారు.



## అసెంబ్లీ ముట్టడికి ఆటోడ్రైవర్ల పిలుపు....




హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ ఆటో డ్రైవర్లు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో హైదరాబాద్‌లో పోలీసులు అప్రమత్తమయ్యారు. శాసనసభ భవనం పరిసరాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకునే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే పలువురు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ముందస్తు అరెస్టులు నిర్వహించి, నిర్బంధాలు విధించారు.ఈ అరెస్టులను ఆటో రిక్షా డ్రైవర్ యూనియన్ల జేఏసీ తీవ్రంగా ఖండించింది. పోలీసులు ఎన్ని నిర్బంధాలు చేసినా అసెంబ్లీ ముట్టడిని కొనసాగిస్తామని బీఆర్‌టీయూ నేత వేముల మారయ్య స్పష్టం చేశారు. అక్రమ అరెస్టులు చేస్తున్నారని పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. అదుపులోకి తీసుకున్న ఆటో డ్రైవర్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పరిస్థితిని నియంత్రణలో ఉంచేందుకు పోలీసులు నిరంతరం గస్తీ కొనసాగిస్తున్నారు.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ...

### ఎన్‌కౌంటర్‌లో 12 మంది హతం...





ఛత్తీస్‌గఢ్, **ఆకాంక్ష జనవరి 03:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శనివారం ఉదయం కిష్టారం అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మ ృతిచెందారు. గూఢచారి సమాచారం మేరకు కిష్టారం అటవీ ప్రాంతంలో విస్త ృతంగా గాలింపు చర్యలు చేపట్టిన భద్రతా బలగాలు, మావోయిస్టుల కదలికలను గుర్తించి ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర కాల్పులు జరిగాయి.ఎన్‌కౌంటర్‌లో మ ృతి చెందిన వారిలో కుంట ఏరియా కార్యదర్శి మంగడు ఉన్నట్లు పోలీసు వర్గాలు నిర్ధారించాయి. ఘటనాస్థలిలో ఏకే47, ఇన్సాస్ రైఫిల్స్‌తో పాటు ఇతర ఆధునిక ఆయుధాలు, గోలీలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్న భద్రతా బలగాలు, మరిన్ని మావోయిస్టులు ఉన్నారా అనే కోణంలో గాలింపు కొనసాగిస్తున్నాయి.ఇదే సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మ ృతిచెందారు. రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టుల కదలికలపై కఠిన నిఘా కొనసాగుతోందని, అటవీ ప్రాంతాల్లో భద్రతను మరింత పటిష్టం చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు కార్యకలాపాలకు గణనీయమైన దెబ్బ తగిలిందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి.

## సిద్దిపేట జిల్లా గురుకులంలో అనుమానాస్పద మృతి

### గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హర్షిత..
### ప్రభుత్వ పర్యవేక్షణపై తీవ్ర విమర్శలు...

సిద్దిపేట, **ఆకాంక్ష జనవరి 03:**సిద్దిపేట జిల్లా కేంద్రంగా మరో విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ పర్యవేక్షణా లోపంతో గురుకుల పాఠశాలలో చదువుతున్న మరో బాలిక అనుమానాస్పద స్థితిలో మ ృతిచెందడం కలకలం రేపింది. సిద్దిపేట మండలం మిట్టపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హర్షిత అనే విద్యార్థిని అర్ధరాత్రి మ ృతి చెందింది. ఈ ఘటనతో విద్యార్థినుల భద్రత, వసతులపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారుల సమాచారం ప్రకారం, అర్ధరాత్రి 3 గంటల ప్రాంతంలో హర్షిత మరణించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం బయటకు రాకుండా స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న తర్వాతే స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ కుమార్తె మ ృతి వార్త వినగానే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కన్నీళ్ల మధ్య ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.బాలిక మ ృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మ ృతికి గల కారణాలపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. హర్షిత స్వగ్రామం కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండలంలోని కళ్ళేపల్లి అని గుర్తించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ముందుగా ఎలాంటి సమాచారం తల్లిదండ్రులకు ఇవ్వలేదన్న ఆరోపణలు కూడా వెలువడుతున్నాయి.ఈఘటనతో గురుకుల పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల భద్రతపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రభుత్వ పర్యవేక్షణ లోపాలే ఇటువంటి విషాదాలకు కారణమవుతున్నాయంటూ విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

# ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వరా...?

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హుందాతనం.

ఇప్పుడు అవమానాలు...

సీఎంకు భజన చేయాలా?..

సభా సంప్రదాయాలు తుంగలో తొక్కారు

రేవంత్ పాలనపై మాజీ మంత్రి గంగుల ఫైర్...



హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇంతటి అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత గంగుల కమలాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అప్పట్లో కిరణ్‌కుమార్‌రెడ్డి స్పీకర్‌గా ఉన్నారని, ఆ తర్వాత మనోహర్ బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేస్తూ, ఉద్యమ కాలంలో కూడా ఇలాంటి పరిస్థితులు చూడలేదని పేర్కొన్నారు. సభలో ఉన్న సభ్యులందరికీ సమాన హక్కులు ఉంటాయని నాటి స్పీకర్ మనోహర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తు చేశారు. అయితే నిన్న అసెంబ్లీలో ప్రస్తుత స్పీకర్ వ్యవహరించిన తీరు బాధాకరమని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని తమ గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. అప్పట్లో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొచ్చి ప్రజా సమస్యలపై చర్చ జరిపామని తెలిపారు. పక్షపాత వైఖరితో వ్యవహరించవద్దని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. సభా సంప్రదాయాలకు అనుగుణంగా వ్యవహరించి తన శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కులు ఉంటాయో అవే హక్కులు ప్రతి సభ్యుడికీ ఉంటాయని స్పష్టం చేశారు. తాము వ్యక్తిగతంగా కాకుండా ప్రజల హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు. నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గిల్లికజ్జాలు పెట్టుకునే ధోరణితో వ్యవహరించారని గంగుల కమలాకర్ ఆరోపించారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చారని, కడుపునిండా తిట్టి వెళ్లారని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎజెండాను కూడా ఉదయం రెండుగంటలకు ఇవ్వడం సబబా అని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంపై చర్చకు తాను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడం ఏంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి భజన చేయాలా అంటూ ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని, అప్పటి స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని తెలిపారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంతు నొక్కడానికే పని చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లా, రేవంత్ ప్యాలెస్‌లా నడుపుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి భజన చేసేందుకే అసెంబ్లీకి వెళ్లాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, స్పీకర్, సీఎం ఇద్దరూ సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతున్నారని గంగుల కమలాకర్ తీవ్ర విమర్శలు చేశారు.

## రమణక్కపేటలో పరువు హత్యకు యత్నం...!

ప్రేమ వివాహం చేశాడని యువకుడిని స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టిన యువతి కుటుంబీకులు...





ఏలూరు, **ఆకాంక్ష జనవరి 03:** ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. తమ కూతురిని ప్రేమ వివాహం చేసుకున్నాడనే కారణంతో ఓ యువకుడిని స్తంభానికి కట్టేసి దారుణంగా చితకబాదిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల విచారణలో బయటపడ్డాయి. మండవల్లి మండలం కారుకొల్లుకు చెందిన సాయిచంద్ అనే యువకుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. రమణక్కపేట గ్రామంలో పోస్ట్ ఉమెన్‌గా పనిచేస్తున్న సాయి దుర్గను తాను గత ఎనిమిదేళ్లుగా ప్రేమించానని, కుటుంబ పెద్దల అనుమతి లేక పోయినా ఇటీవల వివాహం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ప్రేమ వివాహాన్ని అంగీకరించలేని సాయి దుర్గ తల్లిదండ్రులు కందుల బాబు, విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహానికి గురయ్యారని తెలిపారు. గత నెల 31న తనను రమణక్కపేటకు పిలిపించుకుని గ్రామంలో ఓ స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టారని, ఈ దాడిలో మరో నలుగురు కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారని సాయిచంద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా తన భార్యను కిడ్నాప్ చేశారంటూ అబద్ధపు ఆరోపణలు చేసి తనపై దాడికి పాల్పడ్డారని వాపోయాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన సాయిచంద్ చికిత్స పొందుతున్నట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రాథమిక విచారణలో ప్రేమ వివాహాన్ని అంగీకరించలేకనే ఈ దాడి జరిగినట్లు తేల్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో పాత్ర ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ముందు హాజరుపర్చగా కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటన ప్రేమ వివాహాలపై కొనసాగుతున్న సామాజిక వ్యతిరేకతను మరోసారి వెలుగులోకి తెచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వ్యక్తిగత కక్షలతో హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## సావిత్రి బాయి పూలే ఆదర్శాలు, ఆశయాలు, ఆలోచనలను సమాజంలో ముందుకు తీసుకెళ్లాలి...



నాగర్ కర్నూల్ టౌన్,**ఆకాంక్ష జనవరి 03:** సమాజంలో మహిళల విద్య, సామాజిక చైతన్యం, సమానత్వం కల్పించిన సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు శమ స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ అధ్యాపకులు మదన్మోహన్ రెడ్డి,బోధన సిబ్బంది గుంటి గోపి నరసింహ విద్యార్థుల ముందు ప్రసంగించి సావిత్రి బాయి పూలే జీవిత సారాంశాన్ని, ఆమె కృషి, మహిళల అక్షరాస్యత పెంపు, సమాజంలో రుగ్మతలను తగ్గించడంలో చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. సావిత్రి బాయి పూలే ఆదర్శాలను అనుసరించి వారి ఆశయాలు, ఆలోచనలు సమాజంలో ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన బాలికలను ఎంపిక చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు, సీనియర్ అధ్యాపకులు, బోధన సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపక బృందం వెంకటయ్య, ప్రవీణ్, విష్ణు, వినోద్, పద్మజ, రామ్మోహన్ సీనియర్ అసిస్టెంట్,విజయలక్ష్మి, బాలమ్మ, సాయిలు, రాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా సిబ్బంది శ్రీమతి పద్మజ, విజయలక్ష్మి, బాలమ్మలను ప్రత్యేకంగా సన్మానించారు.

## మహిళలోకానికి ఆదర్శం...సావిత్రి బాయి పూలే...



నాగర్ కర్నూల్ టౌన్**ఆకాంక్ష జనవరి 03:** భారత దేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ సాధికారతకు ప్రతీకగా నిలిచిన సావిత్రిబాయి పూలే ను మహిళల లోకానికి ఆదర్శంగా పేర్కొన్నట్లు గ్రామ సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా, మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సావిత్రిబాయి పూలే చేసిన సామాజిక సేవలను, విద్యా ఉద్యమాల పై ఘనంగా మాట్లాడి, ఆమె ప్రవర్తనను ఆదర్శంగా తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిద్దె ఇందిరా రాములు, ఉప సర్పంచ్ గడ్డమీద మహేష్, పంచాయతీ కార్యదర్శి సామ యాదయ్య, వార్డు సభ్యులు మంగి శాంతయ్య, ఎద్దుల కల్పన, కళ్యాణ్ కరి, నేతాజీ, రంగా నరేందర్, పాత్లవత్ పాండు వంటి అనేక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. వారు సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరుపుతూ, మహిళల సాధికారత మరియు సమాజ సేవల ప్రాముఖ్యతను గుర్తు చేశారు. సావిత్రిబాయి పూలే యొక్క సేవలు, విద్యా ఉద్యమాలు ప్రతి తరం మహిళలకు ప్రేరణగా నిలిచేలా, ఈ కార్యక్రమం గ్రామస్తులలో స్ఫూర్తి సృష్టించిందని అధికారులు పేర్కొన్నారు.

## రామగుండం కమిషనరేట్ పరిధిలో బ్యాంకుల్లో భద్రతపై కఠిన తనిఖీలు...



గోదావరిఖనిటౌన్,**ఆకాంక్ష జనవరి 03:** పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు,ఏటీఎం సెంటర్ల భద్రత పటిష్టం కాబట్టి గోదావరిఖని 1 టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో వాదీ× బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఎణఖీజ బ్యాంక్, గోదావరి అర్బన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్, గాయత్రి బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మరియు మున్సిపల్ పరిధిలోని అన్నిూావీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, అలారం, సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఏవైనా ఉంటే వాటిని తక్షణం గుర్తించి పరిష్కరించాల్సిందిగా అధికారులు సూచించారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా, రికార్డింగ్ సరిగా జరుగుతున్నదా, స్ట్రాంగ్ రూమ్, లైటింగ్, సెక్యూరిటీ గార్డులు పటిష్టంగా ఉన్నారా అని పూర్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ బ్యాంకుల్లో భద్రత ముఖ్యమైనదని, సీసీ కెమెరాలు పూర్తి ప్రాంతాన్ని కవర్ చేసే విధంగా ఉండాలని అన్నారు. ఎటువంటి నేరం జరిగిన సందర్భంలో నిందితులను గుర్తించడానికి మరియు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడానికి ఇది అవసరం అని పేర్కొన్నారు. కస్టమర్లకు భద్రతా అవగాహన కల్పించడం కూడా అత్యంత కీలకం” అన్నారు. పోలీసు తనిఖీలలో ఎస్ఐ అనూష, క్రైమ్ పార్టీ సిబ్బంది ఇతర బ్యాంకులను తనిఖీ చేసి భద్రతా మార్గదర్శకాలు అందించారు. ఈ చర్యలు నేరం నివారణ, ప్రజల భద్రతను మెరుగుపరచడంలో కీలకమని అధికారులు తెలిపారు.



## ఘనంగా చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు...



గోదావరిఖని టౌన్**ఆకాంక్ష జనవరి 03:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు గుండ్ల లక్ష్మీ ప్రసన్న అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సావిత్రిబాయి పూలే (1831 జనవరి 3 1897 మార్చి 10) భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య అని, కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి,ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్య పడుతుందని నమ్మిన ఆమె,తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిందని, కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల,మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారని నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిందని సమాజంలోని కులతత్వం పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు.కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిని అని ఆయన అన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాదు,అన్ని రంగాల్లో ముందుండాలని,దేశానికి పట్టిన దుమ్మును దులపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గొడిసెల ప్రణీత్,అభిషేక్, చైత్ర, ప్రహర్షిని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవకాశాలకు ఎదురు వెళ్లాలి...

అర్జీ-1 జీఎం లలిత్ కుమార్ సూచన...



గోదావరిఖని,**ఆకాంక్ష జనవరి 03:** గోదావరిఖని తిలక్ నగర్ డౌన్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన యువతీ-యువకులకు శనివారం అర్జీ-1 జీఎం లలిత్ కుమార్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ వన్ ఎస్వో టూ జీఎం చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, రాంమోహన్, మాధవ్ రెడ్డి, ఖాజా, శ్రావణ్ కుమార్, ఇంచార్జీ మురళి తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పొందిన గ్రాఫిక్ డిజైనింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సుల యువతీ-యువకులను అభినందించారు. అనంతరం జిఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ, “ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవకాశాల కోసం ఎదురు చూడడం కాదు. మనమే అవకాశాలకు ఎదురు వెళ్లాలని మనం నేర్చుకున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ అవకాశాల కోసం మనం ఉన్న చోటే ఎదురు చూస్తూ ఉండకూడదు, అవసరమైతే హైదరాబాద్ వంటి పెద్ద నగరాలకు వెళ్లి తగిన అవకాశాలను అన్వేషించాలన్నారు. స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలనుకునే వారికి, “చివరికి ఏ రకమైన ప్రొడక్ట్ తయారు చేయాలనుకుంటున్నారో స్పష్టతతో ఉంటే సరిపోతుందని తెలిపారు. చిన్న ఇండస్ట్రీలు, ఎలాంటి ఉత్పత్తులు అయినా, ఆవు పేడ లాంటివి కూడా ఇప్పుడు ఆన్లైన్‌లో లభిస్తున్నాయి. కాబట్టి సృజనాత్మక ఆలోచనతో ముందుకు రావాలని మీవీజు డైరెక్టర్ దశరథ్ అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన యువతీ-యువకులు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. వారు ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను ఉపయోగించి తమ భవిష్యత్తును మరింత ప్రగతిశీలంగా మార్చుకోగల అవకాశాలను పొందడం కోసం స్ఫూర్తి పొందారని అధికారులు తెలిపారు.

## పాపాన్నపేటలో ఘనంగా సావిత్రి బాయి పూలే 195వ జయంతి వేడుకలు...




మెదక్,**ఆకాంక్ష జనవరి 03:** దేశానికి అక్షరానికోసం, సమాజానికి స్ఫూర్తికోసం అజరామరమైన కృషి చేసిన సామాజిక విప్లవ నాయకురాలు, భారతదేశ తొలి మహి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంత సందర్భంగా పాపాన్నపేట మండల కేంద్రంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి సమేక్య (ఏఐఎస్ఎఫ్) మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర చాకలి పాపయ్యా సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల సమర్పించి జోహార్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ సుమారు 200 సంవత్సరాల క్రితం దేశంలో ఉన్న సనాతన భావాలు, మూఢనమ్మకాలపై తిరుగుబాటు చేస్తూ అక్షరాన్ని ఆయుధంగా మలిచిన సావిత్రి బాయి పూలే, నేటి తరానికి స్ఫూర్తి దాయకురాలిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాపాన్న పేట మండల అధ్యక్షులు పార్వయ్య, అరుణ్ కుమార్, ఆర్. మనోజ్, జస్వంత్ గౌడ్ తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. విద్యార్థులు, యువత, సామాజిక కార్యకర్తలు పాల్గొని సావిత్రిబాయి పూలే ప్రాతినిధ్యంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఐపాఠశాలలు, సాంస్కృతిక సంఘాలు ఈ వేడుకలో భాగంగా విద్యార్థులకు సావిత్రి బాయి పూలే జీవితం, సమాజ సేవా కృషి, విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

## రామగుండం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా....

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



గోదావరిఖని,**ఆకాంక్ష జనవరి 03:** రామగుండం నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో మరింత కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ శనివారం తెలిపారు. మంచిర్యాల జిల్లా పర్యటనకు వెళ్తున్న సందర్భంగా ఆయనకు గోదావరిఖని ఎఫ్‌సిఐ క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు,ఐఎన్‌టీయూసీ, జాతీయ నేతలు బాబర్ సలీం పాషా ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వంశీకృష్ణ కాంగ్రెస్ నాయకులతో కాసేపు సెంటర్ చాయ్ తాగుతూ స్నేహపూర్వక సంభాషణ జరిపారు. ఈ సందర్భంలో ఆయన రామగుండం నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త సంవత్సరంలో అభివృద్ధి వైపు మరింత ముందడుగు వేస్తామన తెలిపారు. ముఖ్యంగా రామగుండం పరిధిలోని సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి, వాటిని సమర్థవంతంగా పరిష్కరించడానికి పూర్తిస్థాయి కృషి చేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగి సహాయకులకు అన్న ప్రసాద పంపిణీ...




నాగర్ కర్నూల్, **ఆకాంక్ష జనవరి 03:** నాట్యం, భక్తి, సేవా భావనలతో నిండిన శనివారం జిల్లా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగి సహాయకులకు అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి లోని సత్యసాయి నిత్యాన్న భోజనశాలలో ఈ కార్యక్రమాన్ని లయన్స్ మెంబర్షిప్ జిల్లా కోఆర్డినేటర్ హకీమ్ విశ్వ ప్రసాద్ ప్రారంభించారు. రోగుల వెంట వచ్చిన సహాయకులకు వారం రోజుల పాటు కొనసాగనున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయడం, ఓల్డ్ ఏజ్ హోమ్‌లకు సహాయం, పాఠశాలల్లో న్యూట్రిషన్ ఫుడ్ పై అవగాహన కల్పించడం, అనాథలకు ఆహారం అందించడం వంటి కార్యాక్రమాలు చేపట్టబడ్డాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సమన్వయకర్త, మాజీ క్లబ్ గవర్నర్ రాధాకృష్ణ, క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, సాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎలిమె ఈశ్వరయ్య, సాయి సభ్యులు బిళ్ళకంటి కృష్ణయ్య, సత్యనారాయణ, బాలకృష్ణ, లక్ష్మణ్, సాయి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు

## రామగిరి ప్రగతి పాఠశాలలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు...




రామగిరి,**ఆకాంక్ష జనవరి 03:** స్థానిక సెంటినరీ కాలనీలోని ప్రగతి పాఠశాలలో భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహానీయ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే భారతీయ సమాజానికి దిశానిర్దేశం చేసిన మహా మహిళ అని పేర్కొన్నారు. ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగానే కాకుండా ఆధునిక భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆధునిక విద్య ద్వారానే సమాజ విముక్తి సాధ్యమని నమ్మిన సావిత్రిబాయి పూలే తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి 1848 జనవరి 1న పూణేలో తొలి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యకు బాటలు వేసిందని వివరించారు. కుల వ్యవస్థ,పితృస్వామ్య ధోరణులకు వ్యతిరేకంగా శూద్రులు, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయడం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు భావించారని తెలిపారు. నూతన సామాజిక వ్యవస్థ నిర్మాణం కోసం ప్రాణత్యాగానికైనా వెనుకాడకుండా వారు సమిష్టిగా ఉద్యమించారని గుర్తు చేశారు. సమాజంలో అప్పటి పండితులు మేధావులు కూడా ఆమెను కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే చూసినప్పటికీ, ఆమె సాధించిన ఘనతలు, చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం ఆమె చేసిన కృషి నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ గోవర్ధన్ రావు, ఉపాధ్యాయినిలు రజిత, ఇందిరా, స్వాతి,కోమలత, అపూర్వ, శైలజ, శ్యామల, జ్యోతి, సౌమ్య, మౌనిక, రమ్య,కావ్యశ్రుతి, భాగ్యలక్ష్మి, సౌజన్య, ఉష,బిందు, వసంత తదితరులు పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పెద్దపల్లి జిల్లా ఓదెలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవం ప్రారంభం..

మంచి నైపుణ్యాలున్న డ్రైవర్లే స్కూల్ బస్సులు నడపాలి..




ఓదెల, **ఆకాంక్ష జనవరి 03:** తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవం2026 కార్యక్రమాలు పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. జనవరి 01 నుంచి జనవరి 31, 2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ మాసోత్సవం కొనసాగనుంది. సీక్ సే సురక్ష టెక్నాలజీ సే పరివర్తన్” అనే నినాదంతో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ, ముఖ్యంగా మంచి నైపుణ్యాలు కలిగిన డ్రైవర్లే స్కూల్ బస్సులు నడపాలని స్పష్టం చేశారు. వాహనదారుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. పాదచారులు, కళాశాల యువత, వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. వేగ నియంత్రణ, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా రవాణా శాఖ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంథని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు..



మంథని, **ఆకాంక్ష జనవరి 03:** భారతదేశపు మొట్ట మొదటి మహిళ ఉపాధ్యాయురాలు అయిన సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుకలను మంథని బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూలే గారు మహిళల కొరకు విద్యాసంస్థలు స్థాపించడం మహిళా విద్యాభివృద్ధికి కృషి చేయడం, భారతీయ సంఘ సంస్కర్త, రచయిత్రి, నిమ్న వర్గాల అభ్యున్నత కిక్కృషి చేసిందని అనేక అంశాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాలలో పనిచేస్తున్న మహిళ ఉపాధ్యాయినీలకు శాలువాతో ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలకపల్లి జెడ్పీ హై స్కూల్‌లో

## ఎస్‌టీయూటీఎస్ 2026 డైరీక్యాలెండర్ ఆవిష్కరణ..

నాగర్ కర్నూల్ టౌన్,**ఆకాంక్ష జనవరి 03:** నాగర్ కర్నూల్ జిల్లాలోని తెలకపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఎస్‌టీయూటీఎస్ 2026 డైరీక్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజిటెడ్ హెడ్మాస్టర్ శోభనబాబు, జిల్లా పరిషత్ హై స్కూల్ కార్వంగ గజిటెడ్ హెడ్మాస్టర్ మురళీధర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని డైరీక్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల పాత్ర విద్యా రంగ అభివృద్ధిలో కీలకమని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఐక్యతతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సంఘాలు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూటీఎస్ మండల కార్యదర్శి ఎం.డి. జహంగీర్ పాషా, సంఘ సభ్యులు రవీందర్ సార్, శ్రీను సార్, పద్మలత మేడం, వేదవతి లక్ష్మీనర్సమ్మ మేడం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ముసాయిదా ఓటర్ జాబితా

# సవరణలకు 51 దరఖాస్తులు...



నాగర్ కర్నూల్, **ఆకాంక్ష జనవరి 03:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ జాబితాపై సవరణలకు సంబంధించి శనివారం వరకు మొత్తం 51 దరఖాస్తులు అందాయని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. వీటిలో ఇప్పటికే 28 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించామని, మిగిలిన 23 దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన వెల్లడించారు.ఓటర్ జాబితాలో పేరు చేర్పులు, తొలగింపులు, సవరణలు వంటి అంశాలపై ఇంకా ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత ఓటర్లు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ సూచించారు. ప్రజల సౌకర్యార్థం రేపు ఆదివారం రోజున కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు.ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, సవరణల పరిశీలన పూర్తయ్యాక జనవరి 10న తుది ఎన్నికల ఓటర్ జాబితాను విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

## సావిత్రి జ్యోతిబా పూలే 195వ జయంతి వేడుకలు...

### కస్తూర్బ గాంధీ బాలికల పాఠశాల సందర్శించిన సర్పంచ్ సతీష్...



ఓదెల, **ఆకాంక్ష జనవరి 03:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో సావిత్రి జ్యోతిబా పూలే 195వ జయంతి సందర్భంగా ఓదెల గ్రామ సర్పంచ్ సతీష్ కస్తూర్బ గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, ఆరోగ్య పరిస్థితులు, వసతి సదుపాయాలపై సర్పంచ్ ఆరా తీశారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.అనంతరం విద్యార్థులతో సమావేశమై సావిత్రి జ్యోతిబా పూలే గారి జీవిత చరిత్రను వివరించారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె ఎదుర్కొన్న అనేక కష్టాలు, అవమానాలు, సామాజిక అడ్డంకులను అధిగమిస్తూ మహిళల విద్య కోసం చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని ఎదుర్కొని, మహిళలకు చదువు అందించాలనే సంకల్పంతో అనేక పాఠశాలలను స్థాపించి సమాజంలో మహిళా చైతన్యాన్ని నింపిన మహోన్నత వ్యక్తిగా సావిత్రిబాయి పూలే నిలిచారని కొనియాడారు.ఆడపిల్లలు ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ఉన్నతంగా ఎదగాలంటే చదువు, సంస్కారం ఎంతో కీలకమని సర్పంచ్ సతీష్ తెలిపారు. విద్యతో పాటు మంచి విలువలు అలవర్చుకోవడం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించవచ్చని విద్యార్థులకు సూచించారు. మహిళా విద్యే సామాజిక అభివృద్ధికి పునాది అని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమం అనంతరం సర్పంచ్ సతీష్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి ఆత్మీయతను పంచుకున్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీలత ప్రవీణ్, వార్డు సభ్యులు రాపెల్లి రాజయ్య, దూలం సదానందం తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ బాలికల కళాశాలలో ఘనంగా

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు...



మంథని రూరల్,**ఆకాంక్ష జనవరి 03:** మంథని ప్రాంతంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల)లో భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పీటీసీ మూల సరోజన రెడ్డి హాజరై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతదేశంలో మహిళలకు చదువు అనే ఆయుధాన్ని అందించిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. సమాజంలో మహిళలు ఎదుర్కొన్న అనేక అవరోధాలను అధిగమిస్తూ విద్య ద్వారానే సమానత్వం సాధ్యమని ఆమె నిరూపించారని అన్నారు. మహిళా విద్య కోసం ఆమె చేసిన త్యాగాలు, సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాలలో సేవలందిస్తున్న మహిళా లెక్చరర్లు కే. ఝాన్సీ, ఎం. శ్రీదేవి, సబితా,మౌనికలను ముఖ్య అతిథి శాలువాలతో సన్మానించారు. అనంతరం "సామాజిక సేవలో సావిత్రిబాయి పూలే" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిని బి. లాలిత్య (హెచ్ఈసీ ఫస్ట్ ఇయర్), ద్వితీయ బహుమతిని శ్రీనిధి (ఎంపీసీ సెకండ్ ఇయర్), తృతీయ బహుమతిని కె. అభినయ (హెచ్ఈసీ సెకండ్ ఇయర్) విద్యార్థినులు పొందారు. విజేతలను శాలువాలతో సన్మానించి మెమొంటోలు అందజేశారు.సావిత్రిబాయి పూలే కేవలం ఉపాధ్యాయురాలే కాకుండా గొప్ప సంఘసంస్కర్త, కవయిత్రి అని వక్తలు తెలిపారు. అనేక పాఠశాలలను స్థాపించి మహిళలకు విద్యను అందించారని వితంతు వివాహాలను ప్రోత్సహించారని, బాల్య వివాహాలను రూపుమాపేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. అలాగే అనాధలకు, ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలందించిన గొప్ప మానవతావాదిగా ఆమె చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయాలను కొనసాగించాలని, ఆమె చూపిన మార్గంలో నడవాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ జేఏసీ నాయకుడు బెజ్జంకి డిగంబర్, కళాశాల లెక్చరర్లు బి. శ్రీధర్ రావు, ఆర్. తిరుమల్,ఎల్.ఆర్.కే. రాజేశ్వరరెడ్డి, సిహెచ్. నగేష్‌తో పాటు అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ం

# చదువుల తల్లికి నీరాజనం..

### గాయత్రి విద్యానికేతన్‌లో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి....






పెద్దపల్లి, **ఆకాంక్ష జనవరి 03:** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యా సందేశాలతో, సావిత్రిబాయి పూలే ఆదర్శాలతో మార్మోగింది.వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, భారత సమాజంలో మహిళా విద్యకు బాటలు వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. నేటి రోజున ఆడపిల్లలు స్వేచ్ఛగా విద్యాభ్యాసం చేయగలుగుతున్నారంటే దానికి మూల కారణం సావిత్రిబాయి పూలే చేసిన త్యాగాలు, ఆమె చూపిన దారి అని అన్నారు. ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఆడపిల్లలకు చదువు నేర్పాలనే సంకల్పంతో ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని శ్రీమతి సృజన సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను విద్యార్థులకు సవివరంగా వివరించారు. బాలికల విద్య కోసం ఆమె చేసిన పోరాటం సమాజానికి దిశానిర్దేశం చేసిందని చెప్పారు. సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు.వేడుకల్లో విశ్రాంత దూరదర్శన్ ఉద్యోగి రమణ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సావిత్రిబాయి పూలే ఆదర్శాలను జీవితంలో ఆచరించాలని, విద్యే సమాజాభివృద్ధికి పునాది అనే సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

## సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేకుండా పొన్నం ప్రభాకర్ కటౌట్....

### కాంగ్రెస్ వర్గాల్లో హాట్‌టాపిక్..



హైదరాబాద్,**ఆకాంక్ష జనవరి 03:** హైదరాబాద్ జిల్లా కేంద్రంలో అసెంబ్లీకి వెళ్లే ప్రధాన మార్గంలో వెలసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కటౌట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ కటౌట్‌లో ఏఐసీసీ అగ్ర నాయకుల చిత్రాలకే పరిమితమై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఫోటోలు కనిపించక పోవడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తికర వ్యాఖ్యలకు దారి తీసింది.అసెంబ్లీ సమావేశాల వేళ రాష్ట్ర రాజకీయాల్లో ప్రతీ సంకేతానికీ ప్రాధాన్యం ఏర్పడుతున్న తరుణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కటౌట్ ప్రత్యేక దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అధికార పార్టీ నేతల కటౌట్లలో సీఎం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుల చిత్రాలు ఉంటాయనే అంచనాలకు భిన్నంగా, ఈసారి కేవలం జాతీయ స్థాయి నాయకుల చిత్రాలే కనిపించడం విశేషంగా మారింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీనిని సాధారణ ప్రచార ఏర్పాటుగా పేర్కొంటుండగా, మరికొందరు మాత్రం అంతర్గత రాజకీయ సంకేతాలుగా విశ్లేషిస్తున్నారు.రాష్ట్ర నాయకత్వం జాతీయ నాయకత్వం మధ్య సమతుల్యతను సూచించే ఉద్దేశంతోనే ఇలా జరిగి ఉండొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.కటౌట్ ఏర్పాటు వెనుక ఎలాంటి ఉద్దేశం ఉందన్న దానిపై అధికారికంగా ఎలాంటి స్పందన రాలేదు. అయితే, అసెంబ్లీకి వెళ్లే మార్గంలో ఈ కటౌట్ దర్శనమివ్వడంతో రాజకీయ చర్చలు మరింత ఉద్ధృతంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై ఈ ఘటన ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

## ఉస్మానియా యూనివర్సిటీలో నాసిరకం భోజనం...

### రోడెక్కిన లా కాలేజీ విద్యార్థులు...

హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** హైదరాబాద్ జిల్లా ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీ హాస్టల్‌లో విద్యార్థులకు నెలలుగా నాసిరకం భోజనం అందిస్తున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. గత నెల రోజులుగా హాస్టల్‌లో సరైన ఆహారం పెట్టడం లేదని, భోజనంలో నాణ్యత పూర్తిగా పడిపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నంలో పురుగులు, కూరల్లో వాసన, సరిగా ఉడకని పదార్థాలు పెట్టడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఈ విషయమై పలుమార్లు హాస్టల్ అధికారులకు, కళాశాల యాజమాన్యానికి ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేదని విద్యార్థులు ఆరోపించారు. సమస్యను గాలికి వదిలేసి, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. కనీసం తాగునీరు, పరిశు భ్రతపై కూడా శ్రద్ధ చూపడం లేదని తెలిపారు.ఇక ఓపిక కోల్పోయిన లా కాలేజీ హాస్టల్ విద్యార్థులు యూనివర్సిటీ ప్రాంగణంలో రోడ్డుపైకి వచ్చి నిరసన చేపట్టారు. నాసిరకం భోజనాన్ని వెంట తీసుకొచ్చి చూపిస్తూ తమకు ఎదురవుతున్న పరిస్థితిని మీడియాకు వివరించారు. వెంటనే నాణ్యమైన ఆహారం అందించాలని, హాస్టల్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. ఈ ఘటన ఉస్మానియా యూనివర్సిటీలో కలకలం రేపింది.

## సరిహద్దులు దాటిన అక్రమ రాకెట్ గుట్టు రట్టు...



ముంబై, **ఆకాంక్ష జనవరి 03:** అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఓ రైతు విదేశాలకు వెళ్లి తన కిడ్నీని అమ్ముకోవాల్సి వచ్చిన దారుణ ఘటన మహారాష్ట్రలో వెలుగుచూసింది. చంద్రపూర్ జిల్లాకు చెందిన రైతు రోషన్ ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా 'కిడ్నీ డోనర్ కమ్యూనిటీ గురించి తెలుసుకుని గత నెలలో ఓ ఏజెంట్‌ను సంప్రదించాడు. అతడి సూచనల మేరకు కంబోడియాకు వెళ్లిన రోషన్ తన కిడ్నీని రూ.8 లక్షలకు అమ్ముకున్నాడు.అయితే కిడ్నీ గ్రహీతల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి తనకు మాత్రం తక్కువ మొత్తం మాత్రమే చెల్లించారని రోషన్ ఆరోపించాడు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ అతడు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భారత్ నుంచి కంబోడియా వరకు అక్రమ కిడ్నీ రాకెట్ ఎలా పనిచేస్తుందో, ఏజెంట్లు ఎలా మోసం చేస్తున్నారో ఆ వీడియోలో వివరించాడు.ఈ వీడియో పోలీసుల దృష్టికి వెళ్లడంతో దర్యాప్తు చేపట్టారు. విచారణలో దేశవ్యాప్తంగా విస్తరించిన కిడ్నీ రాకెట్ నెట్‌వర్క్ సరిహద్దులు దాటి పనిచేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఉన్నతస్థాయి వైద్యులు సైతం ఈ అక్రమ వ్యాపారంలో భాగస్వాములై కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.దర్యాప్తులో భాగంగా తమిళనాడు తిరుచ్చిలోని స్టార్ కిమ్స్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ రాజరత్నం గోవిందస్వామి, ఢిల్లీకి చెందిన డాక్టర్ రవీందర్ పాల్ సింగ్‌తో పాటు ప్రధాన ఏజెంట్ రామకృష్ణను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నీ మార్పిడి కోసం గ్రహీతల నుంచి రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వసూలు చేసి, కిడ్నీ అమ్ముకునే పేదలకు మాత్రం రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు మాత్రమే చెల్లిస్తున్నారని పోలీసులు ఆరోపించారు.సరిహద్దులు దాటిన ఈ కిడ్నీ రాకెట్ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను బయటపెట్టేందుకు మరింత లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. పేదల దుస్థితిని ఆసరాగా చేసుకుని జరుగుతున్న ఈ అక్రమ వ్యాపారం సమాజాన్ని షాక్‌కు గురి చేస్తోంది.ం

## డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు...



హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** హైదరాబాద్ నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో ఈగల్ టీమ్ నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు తీవ్ర సంచలనానికి దారితీశాయి. ఈ తనిఖీల్లో ఏపీ బీజేపీ నేత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డి గంజాయి వినియోగిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులకు పట్టుబడ్డాడు. సమాచారం అందుకున్న వెంటనే అప్రమత్తమైన ఈగల్ టీమ్ అతడిని అదుపులోకి తీసుకుని ప్రాథమిక విచారణ చేపట్టింది.అనంతరం సుధీర్‌రెడ్డికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రగ్స్ వినియోగానికి సంబంధించిన నిబంధనల మేరకు అతడిని అరెస్ట్ చేసి డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. చట్ట పరమైన చర్యలతో పాటు పునరావాస చర్యలు కూడా తప్పనిసరిగా అమలు చేస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు.సుధీర్‌రెడ్డి డ్రగ్స్ వినియోగంలో పట్టుబడటం ఇదే తొలిసారి కాదని పోలీసులు వెల్లడించారు. గతంలో కూడా రెండు సార్లు డ్రగ్స్ తీసుకుంటూ పోలీసులకు చిక్కినట్లు రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై దృష్టి సారించారు. సుధీర్‌రెడ్డికి గంజాయి ఎవరి ద్వారా, ఎక్కడ నుంచి అందిందనే కోణంలో విచారణను ముమ్మరం చేశారు.నానక్‌రామ్‌గూడ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ వినియోగం, సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తులు, గ్యాంగ్‌లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతరుల వివరాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో విషాదం...

### కవల పిల్లలకు జన్మనిచ్చిన తల్లి 9 రోజులకు మృతి



గంభీరావుపేట,**ఆకాంక్ష జనవరి 03:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు ఆడ కవల పిల్లలకు జన్మనిచ్చిన తొమ్మిది రోజులకే ఓ తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామానికి చెందిన తమ్మనవేని సౌజన్య (23) మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.డిసెంబర్ 24న పురిటి నొప్పులతో బాధపడుతున్న సౌజన్యను కుటుంబ సభ్యులు సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించగా, ఇద్దరు ఆడ కవల పిల్లలు జన్మించారు. ప్రసవానంతరం సౌజన్య తక్కువ రక్తపోటు సమస్యతో బాధపడుతుండటంతో, మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను కరీంనగర్‌కు రిఫర్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కరీంనగర్‌లోని ఆసుపత్రిలో గత తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతున్న సౌజన్య మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఆరోగ్యంగా ఉన్న యువతిని సరైన సమయంలో సరైన వైద్యం అందించకపోవడమే ఆమె మృతికి కారణమని కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే ఈ దుర్ఘటనకు దారితీసిందని ఆరోపిస్తున్నారు.తల్లి మృతితో కవల శిశువుల భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణీలకు శ్రీమంతం..



సుల్తానాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కట్నపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీమంత కార్యక్రమానికి సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ హాజరై పలువురు గర్భిణీలకు పూలు పండ్లు అందజేశారు.అలాగే అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, ఉపసర్పంచ్ దాసరి రాయమల్లు, వార్డు సభ్యులు ప్రవీణ్, తిరుపతి, సంపత్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, శారద, అఖిల, వెంకటలక్ష్మి, రాయ మల్లమ్మ, హెల్త్ సూపర్వైజర్ రోజా, ఏఎన్ఎంలు కవిత, భారతి, ఆశాలు విజయ, లావణ్య, సి ఎ. సమత, అంగన్వాడి టీచర్లు కనక లక్ష్మి, స్వప్న, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర నకిలీ బంగారం ముఠా గుట్టు రట్టు...



నల్లగొండ,**ఆకాంక్ష జనవరి 03:** అంతరాష్ట్రంగా నకిలీ బంగారం విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు చెందిన ఏడుగురు సభ్యులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, వారి వద్ద నుంచి రూ.1.5 లక్షల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, అర కిలో నకిలీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు.డీఎస్పీ వివరాల ప్రకారం, గత నెల 16వ తేదీన నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూగంజ్ ప్రాంతంలో ఉన్న వినాయక కిరాణా దుకాణం వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. కిరాణా సామగ్రి కొనుగోలు చేసే క్రమంలో దుకాణ యజమానితో సన్నిహితంగా మెలిగిన వారు, తాము పాత బంగారం వ్యాపారం చేస్తున్నామని, రూ.15 లక్షల విలువైన బంగారాన్ని కేవలం రూ.5 లక్షలకే ఇస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన దుకాణ యజమానిని బ్యాంక్‌కు తీసుకెళ్లి రూ.5 లక్షలు నగదుగా డ్రా చేయించి తీసుకున్నారు. అనంతరం అతడికి నకిలీ బంగారాన్ని ఇచ్చి అక్కడి నుంచి పరారయ్యారు.తరువాత బంగారం నకిలీదని గుర్తించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ మరియు సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజార్‌లో నిందితులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ముఠా సభ్యులను పట్టుకున్నారు.అరెస్ట్ అయిన నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వీరిలో ఏ1 రమేశ్ కుమార్ (30), ఏ3 రాజా రామ్ (38), ఏ4 మహేంద్ర కుమార్ (19), ఏ5 మానా రామ్ (38), ఏ6 సురేశ్ కుమార్ (28), ఏ7 దేవా రామ్ (45) ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఏ2 పురన్ కుమార్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వస్తువుల అమ్మకం పేరుతో పట్టణ శివారులోని కతాలగూడెం ప్రాంతంలో గుడిసెలు వేసుకుని కుటుంబాలతో కలిసి నివసిస్తూ, నకిలీ బంగారం మోసాలకు పాల్పడుతున్నారని దర్యాప్తులో వెల్లడైంది.ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ విజయ్ కుమార్, వన్‌టౌన్ ఎస్ఐలు లచ్చిరెడ్డి, వెంకట నారాయణతో పాటు సిబ్బంది విష్ణు, రబ్బానీ, అంజయ్య, సీసీఎస్ సిబ్బంది వహీద్, దస్తగిరి, మహేశ్, నాగరాణిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు
# పాలాభిషేకం చేసిన చిన్న ఓదాల గ్రామస్తులు...



మంథని, **ఆకాంక్ష జనవరి 03:** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని చిన్న ఓదాల గ్రామంలో శనివారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు గ్రామస్తులు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాగుల శారద రాజయ్య, గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయానికి దూపదీప నైవేద్య పథకాన్ని మంజూరు చేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామస్థాయిలో భక్తుల మనోధైర్యాన్ని పెంచుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మంత్రి సేవలను కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పట్ల గ్రామ ప్రజలు కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

# ఊరుకొండ తహసీల్దార్ భూ అక్రమాలు...
### ప్రభుత్వ భూములను రియల్ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టారు..
### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్...



నాగర్‌కర్నూల్, **ఆకాంక్ష జనవరి 03:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కళ్యాణ్ మాట్లాడుతూ ఊరుకొండ మండల తహసీల్దార్ భూ అక్రమాలకు పాల్పడుతున్నాడని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రభుత్వానికి చెందిన భూములను రియల్ఎస్టేట్ వ్యాపారులకు భూమార్పిడి పేరుతో కట్టబెట్టి అక్రమాలకు దోహదం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.గత నలభై సంవత్సరాల క్రితం ప్రభుత్వం గిరిజనులకు కేటాయించిన అసైన్ భూములను నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి రియల్ఎస్టేట్ వ్యాపారులకు బదలాయిస్తున్నారని ఆరోపించారు. ఊరుకొండ మండలంలోని కోరుకొండపేట శివారులో గల 120 సర్వే నెంబర్లలోని నాలుగు ఎకరాల పది గుంటల భూమిని అక్రమంగా భూమార్పిడి చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఊరుకొండ మండలంలో అసైన్ భూములకు రియల్ఎస్టేట్ వ్యాపారుల పేర్లపై పట్టాలు జారీ చేస్తున్నారని, ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని కళ్యాణ్ అన్నారు. ఈ అక్రమాల వల్ల గిరిజనులు తీవ్రంగా నష్ట పోతున్నారని, వారికి న్యాయం జరిగే వరకు బీజేపీ తరపున పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రావు, జిల్లా కార్యదర్శి నాగేందర్ గౌడ్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ, జిల్లా నాయకులు జనార్ధన్, చందు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా పోలీస్ పరేడ్‌లో క్రమశిక్షణ,
# ఫిట్‌నెస్‌పై అదనపు ఎస్పీ దిశానిర్దేశం...



మెదక్,**ఆకాంక్ష జనవరి 03:** పోలీసు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు శారీరక దృఢత్వం తప్పనిసరిగా ఉండాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కవాతుకు ఆయన హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా పరేడ్‌ను సమీక్షించిన అదనపు ఎస్పీ, అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమయపాలన, సమన్వయం అత్యంత కీలకమని తెలిపారు.ప్రజలకు న్యాయం చేకూర్చేలా శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు.రోడ్డు భద్రత మాసోత్సవాల నేపథ్యంలో మాట్లాడిన అదనపు ఎస్పీ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ కట్టుకోవాలని సూచించారు. నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ, ట్రాఫిక్ నియమాలను గౌరవించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు.అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞను పఠనం చేశారు. మోటార్ వాహనాల చట్టంలో పొందు పరిచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ, తోటి రోడ్డు వినియోగ దారులను గౌరవించాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తమ కర్తవ్యాలను శ్రద్ధతో నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్న కుమార్, రంగా నాయక్, సీఐలు మహేశ్, కృష్ణమూర్తి, ఎస్సైలు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేయాలనే సందేశంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# వాహనదారులు నిబంధనలు పాటించాలి....
## రోడ్డు భద్రతపై డీఎస్పీ ప్రసన్నకుమార్...



మెదక్, **ఆకాంక్ష జనవరి 03:** రోడ్డు నిబంధనలను పాటించడం ప్రతి వాహనదారుడి మరియు పాదచారుల బాధ్యతగా ఉంటుందని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల కింద హవేలీ ఘన్ పూర్ ఉన్నంత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ సదుపాయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు మధ్య హాజరుగా చర్చించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ మరియు అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. వారు వాహనదారులను రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జాగ్రత్తలు పాటించమని, వాహనంలో ఎల్లప్పుడూ సీటు బెల్టు ధరించమని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ పత్రాలను తప్పకుండా తీసుకెళ్ళమని అన్నారు. అదనంగా, వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచి మాత్రమే డ్రైవింగ్ చేయాలని, మద్యం సేవించడం, సెల్ ఫోన్ వినియోగం, నిద్రలేమితో డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని డీఎస్పీ స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం గాయాలు, ప్రాణ నష్టం కలిగించే ప్రమాదాలకు దారితీస్తుందని హితవు తెలిపారు.కార్యక్రమంలో రవితేజ, నరేష్, శ్రీలత, ఉపాధ్యాయులు చల్ల రవీందర్, దేవులా రాజేశం, అశోక్, మధురాక్షి, జ్యోతి, రజని, ఎల్లమ్మ, ప్రతిభ, సుజాత, ఫయాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వాహనదారులు మరియు విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించి అవగాహన పొందడం లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో హాస్టల్
# వార్డెన్ ఆగ్రహపూరిత వ్యాఖ్యలు...
### సస్పెండ్ చేసిన జిల్లా అధికారులు



సంగారెడ్డి, **ఆకాంక్ష జనవరి 03:** సంగారెడ్డి జిల్లాలోని సిర్గాపూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో గురువారం ప్రతికూల ఘటన చోటుచేసుకుంది. విద్యార్థులను తల్లీతండ్రీగా చూసుకోవాల్సిన హాస్టల్ వార్డెన్ కిషన్ నాయక్, హాస్టల్ వసతులపై విద్యార్థుల ఫిర్యాదుపై కోపానికి లోనయ్యారు.వీడియోలో ఆయన వీధి రౌడీలా ప్రవర్తిస్తూ, హాస్టల్ వంటమనిషికి ఫోన్ చేసి, విద్యార్థులను దూషిస్తూ అందరికీ విషం పెట్టి చంపేయ్ పీడ పోతది" అని హెచ్చరిస్తున్నట్లు ప్రత్యక్షంగా కనిపించింది. ఈ ఆడియో మరియు వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయి, పెద్ద నిరసనకు కారణమైంది. విద్యార్థులు గత 10 రోజులుగా హాస్టల్‌లో కరెంట్ లేకపోవడం, సమస్యపై వార్డెన్‌ను అడిగితే తాగి బూతులు తిట్టడం వంటి ఘటనలను కూడా మీడియాకు వెల్లడించారు. కోపంతో పిల్లలను బూతులు తిట్టిన హాస్టల్ వార్డెన్ ఆ ఆలోచనాత్మక వ్యాఖ్యలు చేయడమే పరిస్థితిని మరింత ఘాతుకరంగా మార్చింది.ఈ ఘటనపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ వార్డెన్ కిషన్ నాయక్‌ను హాస్టల్ విధుల నుంచి సస్పెండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం, విద్యార్థుల భద్రత మరియు హాస్టల్ వసతుల పునరాలోచనపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుంది.వార్డెన్ ఆగ్రహపూరిత వ్యాఖ్యలు విద్యార్థుల హక్కులను హద్దులు దాటుతున్నాయని, ఘటనపై పూర్తి గణనీయమైన దర్యాప్తు జరుగుతోందని జిల్లా అధికారులు వెల్లడించారు.

## కొల్లాపూర్ అభివృద్ధికి బీఆర్ఎస్ విజయం అవసరం....



కొల్లాపూర్,**ఆకాంక్ష జనవరి 03:** కొల్లాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ లేదా కాంగ్రెస్ కదా, బీఆర్ఎస్ గెలవాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి శనివారం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన 19 వార్డుల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి కొల్లాపూర్ మున్సిపాలిటీలో దిశా నిర్దేశం చేశారు. బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "కొల్లాపూర్ అభివృద్ధి చేయాలంటే బీఆర్ఎస్ గెలవాలి. కార్యకర్తల జోలికి వస్తే మీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని కాంగ్రెస్ నేతలకు హెచ్చరిస్తున్నాం" అన్నారు.మున్సిపల్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన పేర్కొన్నారు, "కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలతో గ్రామాల ప్రజలు నిరాశ చెందారు. నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది, అది నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమైంది.విభిన్న అభివృద్ధి పనులపై ఆయన విమర్శలు గుమ్మరించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీలో నిర్మాణ పనులు, పార్కులు, అగ్రికల్చర్ కళాశాల వంటి ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి మట్టిలో కలిపిందని అన్నారు. మున్సిపాలిటీలో డ్రైనేజీ, తాగునీటి, విద్యుత్ సమస్యలు తీవ్రతరం అయ్యాయని, అవినీతిపరమైన ప్రచారాలతో కొల్లాపూర్ అభివృద్ధి గాలి కరిగిపోతోందని బీరం హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు.అదనంగా, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు "ఒకే ఇంట్లో 30 దొంగ ఓట్లు నమోదు చేసుకున్నారని ఆరోపిస్తూ, ఎన్నికల సవాళ్లను ఉద్దేశించారు. అయితే, ఎప్పుడైనా మున్సిపల్ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ఆయన వాదించారు.మంత్రులు, ముఖ్యంగా జూపల్లి కృష్ణారావు రెండు సంవత్సరాల వ్యవధిలో కొల్లాపూర్ అభివృద్ధికి ఏమీ చేసినట్టేదేమీ లేదని ప్రశ్నిస్తూ, "మేము నిర్మించిన మెయిన్ రోడ్ డివైడర్, 17వ వార్డులో పార్క్, చుక్కాయిపల్లి వంతెన, ఈదమ్మ తల్లి గుడి వంటి ప్రాజెక్టులు కొల్లాపూర్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి" అని తెలిపారు.ఈ సమావేశంలో కొల్లాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు స్పష్టమైన దిశా నిర్దేశం ఇచ్చారు, తద్వారా వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని ఖాయం చేయాలని ఉద్దేశించారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ
# 2025 ను వేగవంతం చేయాలి...



పెద్దపల్లి, **ఆకాంక్ష జనవరి 03:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2025 ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ 2025 ను వేగవంతంపై బీఎల్ వోల సమీక్షలో పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రతీ బూత్ పరిధిలో తప్పనిసరిగా ఇంటింటి సర్వే నిర్వహించి 100 శాతం మ్యాపింగ్ చేయాలని సూచించారు.ఇంటింటి సర్వే సమయంలో ఓటర్ల వివరాలు తీసుకుని జాబితా మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితాలో భాగంగా 2025 వ సంవత్సరంలోని ఓటర్లను 2002 ఓటర్ జాబితాలో మ్యాపింగ్ చేయుటకు తక్కువ పురోగతిలో ఉన్న బిఎల్ఓ ల పనితీరును పరిశీలించారు. నియోజక వర్గం పరిధిలోని బూత్ స్థాయి అధికారులు రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్ డీవో బొద్దుల గంగయ్య, పెద్దపల్లి తహసీల్దార్ దండిగ రాజయ్య యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, బీఎల్ వోలు పాల్గొన్నారు.

## అధికార బలంతో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు...
### భయభ్రాంతులకు గురిచేయడం తగదు కమల్ రాజు హెచ్చరిక



ఖమ్మం, **ఆకాంక్ష జనవరి 03:** ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం ఆళ్లపాడు: ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు శనివారం ఆళ్లపాడు గ్రామంలో పర్యటించి, అధికార బలాన్ని ఉపయోగించి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఈ జిల్లాలో కొన్ని పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న అక్రమ కేసుల కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం జాగ్రత్త చేశారు. కమల్ రాజు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర ఓటమి పాలితదని, ఆ ఓటమిని తట్టుకోలేకే ప్రభుత్వం కక్షపూరితంగా బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు దిగిందని మండిపడ్డారు. అధికార ముసుగులో పెడుతున్న ఈ అక్రమ కేసులు తాత్కాలికమని, పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవద్దని, ఎల్లవేళలా పార్టీ వారి వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరావు, మాజీ జడ్పీటీసీ బానోత్ కొండ, బీఆర్ఎస్ మండల కార్యదర్శి మోదుగుల నాగేశ్వరావు, నాయకులు పార ప్రసాద్, ఎస్సీ సెల్ నాయకుడు గద్దల వెంకటేశ్వర్లు, ఆళ్లపాడు సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వరావు, పార్టీ నాయకులు చుక్కారావు, యువజన నాయకుడు సుభాని తదితరులు పాల్గొన్నారు.పార్టీ నేతల పర్యటన ద్వారా కార్యకర్తలకు ఆత్మవిశ్వాసం అందించడమే ప్రధాన ఉద్దేశమని కమల్ రాజు పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సులో తల్లి చూపిన మమత...
### చంటి బిడ్డకు బస్సులోనే ఊయల ఏర్పాటు...



భద్రాద్రి కొత్తగూడెం**ఆకాంక్ష జనవరి 03:** ఎలాంటి పరిస్థితిలోనైనా తల్లి ప్రేమకు సాటిలేదని నమ్మించే ఘట్టం భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం రహదారి మధ్య చోటుచేసుకుంది. తండ్రి లేని చిన్నారి ఏడుపును వినలేక ఆ తల్లి ఆర్టీసీ బస్సులోనే ఊయల ఏర్పాటు చేసి తన చంటిబిడ్డను హాయిగా నిద్రపెట్టింది.ఈ సంఘటన ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో చోటుచేసుకుంది. బస్సు భద్రాచలం నుండి ఖమ్మం వెళ్తుండగా, ఒక మహిళ తన చంటిబిడ్డతో ప్రయాణిస్తుంది. బస్సు ప్రయాణంలో వాతావరణం లేదా కదలిక కారణంగా చిన్నారి ఏడుపు మొదలైంది. అన్ని ప్రయత్నాలూ ఫలించక పోయిన ఆ తల్లి తన బ్యాగ్ నుంచి చీర తీసి, వెంటనే బస్సులోనే ఊయల ఏర్పాటు చేసింది.చీరను బస్ లగేజీ క్యారియర్‌కు కట్టించి, ఆలోచనాపూర్వకంగా చిన్నారిని అందులో పెట్టి ఊపడం ప్రారంభించింది. కొద్దిసేపటికి చిన్నారి ఏడుపు ఆపి, సుఖంగా నిద్రకు వెళ్లింది. బస్సులోని ఇతర ప్రయాణికులు ఈ సానుకూల దృశ్యం చూసి ఆనందం వ్యక్తం చేశారు.ప్రయాణికుల అభిప్రాయం ప్రకారం, ఈ తల్లి చూపిన మమత ఒక ఆదర్శంగా నిలుస్తుందని, పిల్లలకి తల్లుల ప్రేమ ఎప్పటికీ సరిహద్దులేదు అనే సందేశం అందించిందని తెలిపారు.చిన్నారి ఏడుపు ఆగడంతో బస్సులోని ప్రతి ఒక్కరి మనసు హాయిగా మారింది. తల్లిదండ్రుల శ్రద్ధ, ప్రేమ చిన్నారుల జీవితాల్లో ఎంతగానో భరోసా మరియు సౌకర్యాన్ని కల్పిస్తుందనే ఉదాహరణ ఇది

## మంథనిలో ఆటో యూనియన్
# జేఏసీ నేతల ముందస్తు అరెస్ట్



మంథని,**ఆకాంక్ష జనవరి 03:** తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా మంథనిలో పోలీసుల పెట్టి అరెస్టు చేసిన మంథని పోలీసులు అరెస్ట్ అయిన వారిలో తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ నాన్ (పొలిటికల్) జిల్లా అధికార ప్రతినిధి మంథని అశోక్ మంథని నియోజకవర్గం ఇంచార్జీ గడిపల్లి శ్రీనివాస్ మంథని మండల అధ్యక్షులు. జంజర్ల రమేష్ ప్రధాన కార్యదర్శి తుంగల రాజు ప్రచార కార్యదర్శి తిక్క సాగర్ ఉన్నారు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళ్లే ప్రయత్నం చేస్తున్న సమయంలోనే పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు మంథని పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేపట్టారు.

## పెరిక కుల సంఘం ముత్తారం
# మండల అధ్యక్షుడిగా అక్కల నారాయణ నియామకం...



ముత్తారం, **ఆకాంక్ష జనవరి 03:** పెరిక కుల సంఘం ముత్తారం మండల అధ్యక్షుడిగా అక్కల నారాయణ నియమితులయ్యారు. ముత్తారం మండలంలోని ఖమ్మం పల్లి గ్రామానికి చెందిన అక్కల నారాయణకు ఈ నియామక ఉత్తర్వులను పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందుల ఆనంద్ అందజేశారు.నియామక కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం తిరుపతి, సోషల్ మీడియా కన్వీనర్ దొమ్మటి రాజులు పాల్గొన్నారు. అక్కల నారాయణను నియమించినందుకు ఈ నేతలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన అక్కల నారాయణ మాట్లాడుతూ, "పెరిక కుల సంఘ అభివృద్ధికి నా పూర్ణ సమర్ధనతో పనిచేస్తూ, కుల బాంధవులు ఎదుర్కొంటున్న సమస్యలకు సమయానికి స్పందిస్తూ, జిల్లా కమిటీ, రాష్ట్ర కమిటీతో కలిసి పెరిక కుల సంక్షేమం కోసం ముందుకు సాగుతాను" అని తెలిపారు.అక్కల నారాయణ నియామకం ద్వారా ముత్తారం మండలంలో పెరిక కుల సంక్షేమ కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయి.

# పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తు వ్యక్తి మృతి...



ఓదెల,**ఆకాంక్ష జనవరి 03:** ఓదెల మండలం ఇందుర్తి గ్రామంలో అంబాల రాయమల్లు 68 సంలు అనే వృద్ధుడు పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదవశాత్తు ఒడ్డు జారీ పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఇందుర్తి గ్రామంలో ఒక్కసారిగా చోటు చేసుకుంది..ఈ సంఘటనతో గ్రామంలో ఒక్కసారిగా విషాదచాయాలు అలుముకున్నాయి.మృతునికి భార్య కళ,ఇద్దరు కూతుర్లు సౌజన్య, షైలు అల్లుండ్లు ఉన్నారు.కూతుర్లు, బంధువుల రోధనలతో ఒక్కసారిగా గ్రామంలో విషాదం అలుముకుంది.పేద వారు కావడం తో ప్రభుత్వం వీరిని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నిషేధిత సింగిల్ యూజ్డ్
# ప్లాస్టిక్‌పై మున్సిపల్ కఠిన చర్యలు...
### దుకాణాలు, హోటల్స్‌లో ఆకస్మిక తనిఖీలు...



కోరుట్ల, **ఆకాంక్ష జనవరి 03:** కోరుట్ల మున్సిపల్ ప్రాంతంలో శనివారం నాడు నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్ కమిషనర్ రవీందర్ కఠిన హెచ్చరికలు ఇచ్చారు. పట్టణంలోని వివిధ కిరాణా షాపులు, స్వీట్ హోమ్‌లు, టిఫిన్ సెంటర్లు, బేకరీల్లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు ఉపయోగిస్తున్న, విక్రయిస్తున్న దుకాణదారులు, హోటల్ యజమానులకు జరిమానాలు విధించారు. కమిషనర్ రవీందర్ అన్ని దుకాణదారులు బట్ట, పేపర్, జనపనార్ సంచులు ఉపయోగించాల్సిందిగా, అలాగే ట్రేడ్ లైసెన్స్ లేకపోతే షాపులు సీజ్ చేయబడుతాయని స్పష్టంగా హెచ్చరించారు.హోటళ్లలో కస్టమర్లకు నాణ్యమైన ఆహారం అందించమని సూచిస్తూ, షాప్‌ల నుంచి వెలువడిన చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి, మున్సిపల్ వాహనాలకు అందించమని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, అశోక్, రికార్డ్ అసిస్టెంట్ జగదీష్, వార్డ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై మున్సిపల్ ప్రభుత్వం గట్టి నిర్ధారణ ప్రతి దుకాణం, హోటల్ నిబంధనలకు ఆచరణ తప్పక పాటించాలి.

## ఘనంగా తుంగతుర్తిలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు..



తుంగతుర్తి,**ఆకాంక్ష జనవరి 03:** దేశంలో మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ పార్టీ తుంగతుర్తి మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య శనివారం ప్రత్యేకంగా కొనియాడారు. ఈ సందర్భంలో తుంగతుర్తి మండల కేంద్రంలో సావిత్రిబాయి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ, "ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన ధీర వనిత సావిత్రిబాయి పూలే దేశానికి ఆదర్శంగా నిలిచారు" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, మండల నాయకులు గోపగాని రమేశ్, ఉప్పుల నాగమల్లు, బొంకూరి మల్లేశ్, గోపగాని వెంకన్న, నల్లబెల్లి వెంకన్న, బొజ్జ సాయికిరణ్, మల్లికార్జున్, బొంకూరి సాయి, అన్నేబోయిన సురేశ్, అశోక్ వంటి ప్రముఖ నేతలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి
# కలెక్షన్లపై తప్ప దేని మీద ధ్యాస లేదు...
### శాసనసభ విప్ కేపీ వివేకానంద గౌడ్



హైదరాబాద్, **ఆకాంక్ష జనవరి 03:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల మనోభావాలు పట్టడం లేదని, అనుభవరాహిత్యంతో మాత్రమే పాలన నిర్వహిస్తున్నారని శాసనసభ విప్ కేపీ వివేకానంద గౌడ్ ఘాటుగా విమర్శించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ, "పిచ్చోడి చేతిలో రాయిలా రాష్ట్రం పరిస్థితి అయిపోయింది. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒక్క మంత్రి కూడా లేరు. జీహెచ్ఎంసీ విభజనపై మేయర్, ఉపమేయర్, కార్పొరేటర్లను కనీసం సంప్రదించలేదు. కౌన్సిల్ సమావేశాల్లో కూడా సమగ్ర చర్చ జరగలేదు. దొంగచాటున మహానగర విభజన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు," అని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు కూడా జీహెచ్ఎంసీ విభజనకు వ్యతిరేకంగా గొంతెత్తుతున్నారని కేపీ వివేకానంద తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా అసెంబ్లీలో విభజనపై నిరసన వ్యక్తం చేశారని ఆయన గుర్తుచేశారు.కుక్కలు చింపిన విస్తరిలా హైదరాబాద్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధంగా జీహెచ్ఎంసీ విభజన ప్రజలకు నష్టం కలిగించే విధంగా జరుగుతోంది," అని కేపీ వివేకానంద ఆందోళన వ్యక్తం చేశారు.అవసరమైతే కేసీఆర్ హయాంలో కొత్త జిల్లాలు, మహానగర సంస్థలు, మున్సిపాలిటీలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయని, దీని వల్ల రాష్ట్రంలో ఎక్కడా ఇబ్బంది రాలేదని ఆయన గుర్తుచేశారు. అయితే రేవంత్ రెడ్డి మహానగర విభజనను గందరగోళంగా చేస్తున్నారని, ప్రజా పోరాటం ద్వారా దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కలెక్షన్లపై తప్ప దేని మీద ధ్యాస లేదు అని కేపీ వివేకానంద ముగించారు.

## ఆస్తమాతో బాధపడుతూ మనస్థాపానికి
# గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య...

నాగర్ కర్నూల్,**ఆకాంక్ష జనవరి 03:** నాగర్ కర్నూల్ జిల్లా పెద్దాపూర్ గ్రామంలో శనివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. కొంత కాలంగా ఆస్తమాతో బాధపడుతున్న గోద పర్వతాలు మనస్థాపానికి గురై, ఇంట్లోనే పురుగుల మందు తాగి అపస్మరస్థితిలో పడిపోయినట్లు తెలుస్తోంది.కుటుంబ సభ్యులు అతన్ని గుర్తించి వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించినప్పటికీ, ఆ సమయంలో ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై, మృతుని కుమారుడు గోదా శ్రీనివాసులు ఫిర్యాదు చేసిన వెంటనే, ఎస్సై గోవర్ధన్ గారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు

## అన్వేష్ మీద దేశం ద్రోహం కేసు నమోదు చేయాలి: రాజు నేత



హైద్వేరాబాద్ **జనవరి 3(ఆకాంక్ష) :** హిందూ దేవి దేవతలను కించపరిచేలా హిందూ దేవాలయాలను కూలగొట్టాలని హిందూ మతాన్ని నాశనం చేయాలని మాట్లాడిన యూట్యూబర్ నా అన్వేషణ అవినాష్ పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని , కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో తెలంగాణ ఉద్యమకారుడు బిజెపి రాష్ట్ర నాయకులు రాజు నేత పిర్యాదు చేసారు. అనంతరం రాజు నేత మాట్లాడుతూ ఇలాంటి దేశ ద్రోహులు 100 కోట్ల మందికి పైగా ఉన్న హిందువుల మనోభావాలను కించపరిచేలా, రెచ్చగొట్టేలా హిందువులంతా దొంగలని హిందువులు రేపిస్టులని మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నాడని... విదేశాలలో ఉంటూ మన దేశ గడ్డ మీద పుట్టి పెరిగి మన దేశపు సొమ్ము తింటూ అబద్దాలను ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కచ్చితంగా తగిన రీతిలో సమాధానం ఉంటుందని అన్నారు.ఫిర్యాదు చేసిన వారిలో బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగంటి రాజు నేత, హైకోర్టు అడ్వకేట్ రాము, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ, బొమ్మరాసపల్లి సర్పంచ్ చెరుకు తిరుపతమ్మ, వెంకటయ్య, జగన్ చారి తదితరులు ఉన్నారు.

## కరెంట్ షాక్ దుర్ఘటనలో రైతు మృతి...

### కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో ఘటన..





కొమురవెల్లి, **జనవరి 3(ఆకాంక్ష) :** కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామంలో నిన్న సాయంత్రం విషాద సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన గణేబోయిన చందు, వయసు సుమారు 45 సంవత్సరాలు, సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో తన పొలంలో పనిచేస్తుండగా అనుకోకుండా కరెంట్ షాక్ తగిలి మృతి చెందారు.ప్రాంతీయులు తెలిపిన వివరాల ప్రకారం, చందు పొలంలో పంటకు సంబంధించి సాధారణ పనులు చేస్తున్నప్పుడు వైద్య, భద్రతా చర్యలలో లోపం కారణంగా ఈ దుర్ఘటన జరిగింది. పొలం వద్దికి చేరుకున్న గ్రామస్థులు, కుటుంబసభ్యులు వెంటనే సహాయం చేయాలని ప్రయత్నించినప్పటికీ, కరెంట్ షాక్ తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతను మృతిచెందాడు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

## పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ లో గాఢ నిద్రలో బిజెపి ఎమ్మెల్యేలు



హైదరాబాద్**జనవరి 3(ఆకాంక్ష) :** తెలంగాణ అసెంబ్లీలో శనివారం ప్రత్యేక పత్రాల పరిశీలన, ప్రస్తుత పాలనపై చర్చల్లో భాగంగా కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెటూంటేషన్ నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి, పాలన లోపాలు, బీజేపీ ప్రభుత్వ పనితీరు అంశాలను స్పష్టంగా వివరించే ప్రయత్నంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షానికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలు గాఢ నిద్రలోకి జారిపోవడం అసెంబ్లీ లోపల నవ్వును, విమర్శనాత్మక వ్యాఖ్యలను తెప్పించింది. నిరంతర ప్రజెంటేషన్ మరియు గణాంకాల వివరణలు వినిపిస్తున్నప్పటికీ, కొంత మంది బీజేపీ ఎమ్మెల్యేలు కుర్చీలపై నిలకడగా ఉండలేక నిద్రలోకి మునిగి పోయారు. సభలోని కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు, పత్రికా ప్రతినిధులు ఈ సంఘటనను ఫోటోలు మరియు వీడియోల ద్వారా రికార్డు చేశారు.కాంగ్రెసు వైపు నుండి "ప్రతిపక్షం దృష్టిని ఆకర్షించడంలో అవరోధం లేకుండా, ప్రజా అంశాలను సవివరంగా వివరించడం అవసరం" అనే వ్యాఖ్యలు రావడం గమనార్హం. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు, స్వీయ నిర్ధారణ ప్రకారం, "నిద్రపోయిన కారణం ప్రెజెంటేషన్ భాషా నిర్మాణం మరియు స్లైడ్‌ల పొడవు" అని తెలిపారు.అసెంబ్లీలో రాజకీయ వాతావరణంలో, ఈ చిన్న, అతి హాస్యాస్పద సంఘటనకు ప్రజా దృష్టి మరింత కేంద్రీకృతమైంది. పవర్ పాయింటేషన్ ముగిసిన తర్వాత, ఎమ్మెల్యేలు నిద్ర నుండి మేల్కొని, చర్చను కొనసాగించారు.

## సింగరేణి సిబ్బందిపై మద్యం సేవిస్తున్న వ్యక్తుల దాడి...

### దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తు వేగవంతం..

గోదావరిఖని,**జనవరి 3(ఆకాంక్ష) :** సింగరేణి సంస్థలో ఎస్ & పి.సి జందార్‌గా విధులు నిర్వర్తిస్తున్న బోయిన ఓదెలు, ఇతర సిబ్బంది పై కొరుకుదాడికి పాల్పడిన ఘటనలో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదైనట్లు సిఐ ఇంద్రసేన రెడ్డి వెల్లడించారు.సెకండ్ షిఫ్ట్‌లో మధ్యాహ్నం సుమారు 1.30 గంటలకు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి సూచనల మేరకు లోడింగ్ పాయింట్ వద్ద ప్యాక్ చేసిన వ్యాగన్ డోర్ ఓపెన్ అయిన విషయం పరిశీలించేందుకు బోయిన ఓదెలు, కే.రాజమౌళి, బి.రమణారెడ్డి సెక్యూరిటీ గార్డు ఎం.శివ (ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు, కే.ఓదెలు (సెంట్రింగ్ మజ్దూర్) సంఘటనా స్థలానికి వెళ్లారు.అయితే, జూ&ూ ఆవరణలో మద్యం సేవిస్తున్న ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు, నిషిద్ధ ప్రాంతంలో ఉన్నారంటూ హెచ్చరించినప్పటికీ, గొడవకు దిగుతూ "తిరిగి వస్తే చంపేస్తాం" అంటూ బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. కొద్దిరోజులలో వారిని చంపే ఉద్దేశంతో కర్రలు, బండరాళ్లతో దాడికి పాల్పడగా, బోయిన ఓదెలుకు చేయి విరగడం, ఎం.శివకు ఎడమ చెంప గాయం, మిగతా సిబ్బందికి రక్త గాయాలు అయ్యాయి.సిబ్బంది సమాచారం అందుకున్న పోలీసులు అబ్బు, రోషన్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగతా ముగ్గురు పరారయ్యారని అధికారులు తెలిపారు. వారు తరచుగా మద్యం సేవిస్తూ విధులకు ఆటంకం కలిగిస్తూనే, ఉద్దేశపూర్వకంగా దాడి చేసి చంపుతామని బెదిరించారని ఫిర్యాదు ఆధారంగా ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ ఇంద్రసేన వెల్లడించారు. పరారీలో ఉన్న వారిని త్వరలోనే పట్టుకోవాలని పోలీసులు వెల్లడించారు.

### బీసీసీఐ ఆదేశాల మేరకు ముస్తాఫిజుర్‌ను వదులుకున్న కోల్‌కతా నైట్?రైడర్స్- మరి బంగ్లాదేశ్ పర్యటనకు భారత్ వెళ్తుందా అందరి మదిలో ఇదే ప్రశ్న!

బంగ్లాదేశ్?లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆ దేశంతో భారత్? ఆడాల్సిన ద్వైపాక్షిక సిరీస్? రద్దు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజాగా బీసీసీఐ ఆదేశాల మేరకు బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్?ను కోల్?కతా నైట్?రైడర్స్ తమ జట్టు నుంచి రిలీజ్ చేసింది. అయితే ఆ దేశ ఆటగాడిని ఐపీఎల్?లో ఆడేందుకు అనుమతించని బీసీసీఐ, మన ప్లేయర్లను బంగ్లాదేశ్?కు పంపే సాహసం చేస్తుందా? అనే ప్రశ్నలు అభిమానుల్లో తలెత్తుతున్నాయి.

### సిరీస్ షెడ్యూల్ ప్రకటించిన బంగ్లాదేశ్

ఓవైపు ముస్తాఫిజుర్ ఐపీఎల్?లో ఆడడం గురించి వివాదం కొనసాగుతుండగానే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది భారత్?తో ఆడాల్సిన ద్వైపాక్షిక సిరీస్?ను బీసీబీ కనార్మ్ చేస్తూ షెడ్యూల్ ప్రకటించింది. భారత్‌తో ఆగస్టు- సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు తెలిపింది. ఈ సిరీస్? కోసం టీమ్ఇండియా ఆటగాళ్లు బ ృందం ఆగస్టు చివరివారంలో బంగ్లాదేశ్‌లో పర్యటనకు వెళ్లాల్సి ఉంది.

### అప్పుడూ ఇలాగే

వాస్తవానికి బంగ్లాదేశ్?తో ఈ సిరీస్? గతేడాది ఆగస్టులోనే ఆడాల్సి ఉంది. కానీ అప్పుడు ఆ దేశంలో రాజకీయ అస్థిరత, ఉద్రిక్త పరిస్థితులు ఉండడంతో భారత జట్టు అక్కడికి వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆ సిరీస్ నిరవధికంగా వాయిదా పడింది. అదే సిరీస్? ఈ ఏడాది ఆగస్టు పర్యటనతో భర్తీ కానుందని తాజాగా బంగ్లా క్రికెట్ బోర్డు వెల్లడించింది.

### టైమ్ పట్టొచ్చు!

కానీ, ఇప్పటికీ బంగ్లాలో దాదాపు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇటీవల అక్కడ మైనార్టీలపై జరుగుతున్న దాడులు, స్థిరమైన ప్రభుత్వం లేకపోవడం, హింసాత్మక సంఘటనల కారణంగా బీసీసీఐ ఈ పర్యటనకు అనుమతి ఇస్తుందా? అనే సందేహాలు అభిమానుల్లో ఉన్నాయి. అయితే ఈ సిరీస్? జరగడానికి ఇంకా 8 నెలల సమయం ఉంది. కాబట్టి ఆగస్టులో ఉండనున్న ఈ పర్యటనపై ప్రభుత్వం నిర?యం తీసుకోడానికి కూడా చాలా టైమ్ ఉంది. అయితే ప్రభుత్వం ఎలాంటి నిర?యం తీసుకుంటుందో వేచి చూడాలి! ముస్తాఫిజుర్?ను తమ జట్టు నుంచి రిలీజ్ చేసినట్లు కోల్?కతా ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్?లో ఓ స్టేట్?మెంట్ రిలీజ్ చేసింది. '2026 ఐపీఎల్ సీజన్? కోసం వేలంలో కొనుగోలు చేసిన ముస్తాఫిజుర్ రెహమాన్?ను బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ జట్టు నుంచి రిలీజ్ చేస్తున్నాం. అతడి స్థానంలో ఇంకో ప్లేయర్?ను తీసుకునేందుకు బీసీసీఐ మాకు అవకాశం ఇచ్చింది. దీనిపై మరిన్ని అప్డేట్ల కోసం వేచి ఉండండి' అని కేకేఆర్ తమ స్టేట్?మెంట్?లో పేర్కొంది. కాగా, ఇటీవల జరిగిన మినీ వేలంలో ముస్తాఫిజుర్?ను రూ.9.2 కోట్ల భారీ ధరకు కేకేఆర్ కొనుగోలు చేసింది. అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేసుకుంటుందో చూడాలి!

# 'ఆ బంగ్లా ఆటగాడిని రిలీజ్? చేయండి'- కేకేఆర్‌కు ఆదేశం

### బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్‌కు ఎంచుకోవడం మీదా తీవ్ర వ్యతిరేకత- రెహ్మాన్‌ను విడుదల చేయాలని బీసీసీఐ ఆదేశం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ వేలంలో బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలో బీసీసీఐ కీలక నిర?యం తీసుకుంది. ముస్తాఫిజుర్?ను తమ జట్టు నుంచి రిలీజ్ చేయాలని కేకేఆర్?ను ఆదేశించింది. ఒకవేళ వారు ప్రత్యామ్నాయంగా మరొక ప్లేయర్?ను కోరితే దానికి కూడా అనుమతిస్తుందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న తాజా పరిణామాల కారణంగానే ఈ నిర?యం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ నిర?యాన్ని బీజేపీ నేత సంగీత్ సింగ్ సోమ్ స్వాగతించారు. భారతదేశంలోని 100 కోట్ల మంది సనాతనుల మనోభావాలను ద ృష్టిలో పెట్టుకుని బీసీసీఐ తీసుకున్న నిర?యానికి ధన్యవాదాలని తెలిపారు. 100 కోట్ల మంది భావోద్వేగాలను తేలికగా తీసుకోలేమని, ఇది దేశవ్యాప్తంగా ఉన్న హిందువుల విజయమని అన్నారు. సనాతనుల మనోభావాలకు విరుద్ధంగా వెళ్లకూడదని ఎస్ఆర్‌కే అర్థం చేసుకున్నారని అన్నారు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ.9.2 కోట్లకు ముస్తాఫిజుర్?ను కేకేఆర్? దక్కించుకుంది. రెహమాన్ 2016లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. 60 మ్యాచ్‌లాడి 65 వికెట్లు తీశాడు. కాగా, బంగ్లాదేశ్‌లో హిందువులపై వరుస దాడుల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే ఐపీఎల్‌లో బంగ్లాదేశ్ ఆటగాళ్లను తీసుకోవడంపై విమర్శలు మొదలయ్యాయి. ఈ విషయంపై గురువారం బీసీసీఐ వర్గాలు స్పందించినట్లు వార్తలు వచ్చాయి. బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఐపీఎల్‌లో ఆడకుండా నిరోధించడంపై తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గనిర్దేశకాలు రాలేదని పేర్కొన్నాయి. ఇది తమ చేతుల్లో లేని వ్యవహారమని, దీనిపై ఇంతకుమించి మాట్లాడటానికి ఏమీ లేదని వెల్లడించాయి. తాజాగా జట్టు నుంచి రిలీజ్? చేయాలని ఆదేశించింది. దీంతో కేకేఆర్ ముస్తాఫిజుర్ స్థానంలో సరైన ప్రత్యామ్నాయ ఆటగాడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మరోవైపు ఈ వివాదల వేళ తమ జట్టు ఆడే సిరీస్‌లపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కీలక ప్రకటన చేసింది. అందులో భారత్‌తో షెడ్యూల్‌ను కూడా ఉంది. భారత్‌తో ఆగస్టు-సెప్టెంబరు మధ్య మూడు వన్డేలు, మూడు టీ20 సిరీస్‌లు ఆడనున్నట్లు పేర్కొంది. గత ఏడాది రెండు జట్ల మధ్య సిరీస్‌లు జరగాల్సి ఉండగా, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ ఆగస్టు టూర్‌తో అది భర్తీ కానుందని బీసీబీ ప్రకటించింది.

### 'షారుక్ ఖాన్ దేశానికి క్షమాపణలు చెప్పాలి'

మరోవైపు ముస్తాఫిజుర్?ను కేకేఆర్? తీసుకోవడంపై తీవ్ర రాజకీయ దుమారం చెలరేగింది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఈ ఎంపికపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా కేకేఆర్ సహ యజమాని షారుక్ ఖాన్?పై ఆధ్యాత్మిక గురువు దేవకీనందన్ ఠాకూర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బంగ్లాదేశ్‌లో హిందువులు హత్యలు, దాడులకు గురవుతున్న పరిస్థితుల్లో అక్కడి ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం అమానుషమని అన్నారు. షారుక్ ఖాన్? దేశానికి క్షమాపణ చెప్పాలని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇలియాసి డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ ప్రకటన చేయాలని, ముస్తాఫిజుర్‌ను జట్టు నుంచి తొలగించాలని ఆయన కోరారు. శివసేన నేత సంజయ్ నిరుపమ్ కూడా షారుక్ ఖాన్?ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. దేశమంతా బంగ్లాదేశ్‌పై ఆగ్రహంగా ఉందని, ఇలాంటి సమయంలో బంగ్లాదేశీ ఆటగాడు జట్టులో ఉంటే, అది షారుక్ ఖాన్?కే ప్రమాదంగా మారొచ్చని అన్నారు. ఈ వివాదంపై కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనేత్ స్పందించారు. 'ముందుగా బంగ్లాదేశీ ఆటగాళ్లను ఐపీఎల్ వేలంలోకి ఎవరు అనుమతించారు? దీనికి బీసీసీఐ, ఐసీసీ సమాధానం చెప్పాలి. ఐసీసీ చీఫ్ దీనిపై స్పష్టత ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

# రేగుపండ్లు అంటే ఇష్టమా? - వీటిని తింటే శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

### రేగుపండ్లను ఔషధాల గనిగా చెబుతోన్న నిపుణులు - వీటిని తినడం వల్ల ఏఏ లాభాలు ఉన్నాయో వివరణ!



తీపి, పులుపు, వగరు కలగలిసిన రుచితో ఉండే రేగుపండ్లు అంటే అందరికీ ఇష్టమే. ఈ సీజన్?లో ఎక్కడ చూసిన బండ్లపై కనిపిస్తుంటాయి. ఈ పండ్లు కేవలం రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయంటున్నారు నిపుణులు. శరీరానికి కావాల్సిన పోషకాలు వీటిలో ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో రేగుపండ్లు తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం! రోగనిరోధక శక్తికి : ఇందులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో శరీరంలో ఉత్పత్తయ్యే హానికర ఫ్రీ రాడికల్స్‌ను తొలగించి ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే, ఇందులోని లిగ్నిన్ పీచు సైతం యాంటీఆక్సిడెంట్‌లా పనిచేసి రోగనిరోధక కణాల ఉత్పత్తికి తోడ్పడుతుందని తెలియజేస్తున్నారు. తద్వారా శరీరానికి వ్యాధుల మీద తిరగబడే శక్తి పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఈ రెండు గుణాలవల్ల రేగుపండు డయాబెటిస్, గుండెజబ్బుల నుంచి రక్షిస్తుందని చెబుతున్నారు. ఇంకా, జలుబూ, ఫ్లూ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుందంటున్నారు. కాబోయే అమ్మకు పురిటి నొప్పుల భయం - సిజేరియన్ ప్రసవాలు పెరగడానికి కారణాలివే!

### నిద్రకి :

రేగు పండ్లలో ఉండే 'శాపోనిన్' అనే పదార్థం మెదడును ప్రశాంతపరుస్తుందంటున్నారు నిపుణులు. ఇది సహజంగా నిద్ర పట్టేలా చేసి, నిద్రలేమి సమస్యను తగ్గిస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా, దీర్ఘకాలిక ఆందోళన, ఒత్తిడితో బాధపడేవాళ్లకి రేగుపండ్లు మంచి ఔషధమని సూచిస్తున్నారు. ఈ పండ్లతో మరిగించిన టీ తాగినా మంచిదంటున్నారు. చైనా, ఆసియాలోని ఇతర ప్రాంతాలలో రేగుపండ్లను నిద్రలేమి, ఆందోళన, మరిన్నింటికి నివారణగా చాలా కాలంగా ఉపయోగిస్తున్నారని అధ్యయనం పేర్కొంది.

### క్యాన్సర్లకి:

రేగులోని విటమిన్-సికి యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయని అధ్యయనం పేర్కొంది. ఈ పండ్ల నుంచి తీసిన ఎక్స్‌ట్రాక్ట్‌ను పేగు, గరాశేయ, అండాశయ, రొమ్ము, చర్మ, కాలేయ క్యాన్సర్ల నివారణలో వాడినప్పుడు.. ఆయా కణాలను నాశనం చేసినట్లు స్పష్టమైందట.

జీర?సంబంధిత వ్యాధులకి: రేగు పండ్లలో అధికంగా ఉండే పీచు పొట్ట గోడల్ని సంరక్షిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా హానికర బ్యాక్టీరియా, అల్సర్ల నుంచి కాపాడుతుందంటున్నారు. ఈ పండు మంచి ప్రొబయోటిక్‌గానూ పనిచేసి, పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగేలా చేస్తుందని పేర్కొంటున్నారు. ఫలితంగా, కడుపులో మంటని తగ్గిస్తుందని వివరిస్తున్నారు. వీటి రసం నోటి పుండ్లు, గొంతు మంటనీ నివారిస్తుందని తెలియజేస్తున్నారు. అంతేకాదు, ఈ పండ్లు ఆకలినీ తగ్గిస్తాయట. తద్వారా బరువుని నియంత్రించుకోవచ్చని అంటున్నారు.

### అందానికి :

రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు రేగుపండ్లలో ఉండటంతో చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయంటున్నారు నిపుణులు. ఇవి ముఖంపై గీతలు, ముడతలను రానివ్వకుండా చర్మాన్ని మ ృదువుగా ఉంచుతాయని చెబుతున్నారు. అలాగే, ముందస్తు వ ృద్ధాప్య ఛాయలను దరికి చేరనీయవని తెలియజేస్తున్నారు. వీటిలోని పోషకాలు జుట్టు రాలకుండా కాపాడతాయని పేర్కొంటున్నారు.

### ఈ ప్రయోజనాలు కూడా! :

రేగు పండ్లలో పొటాషియం, ఫ్లోరైడ్, ఇనుము పుష్కలంగా ఉంటుందని అధ్యయనం పేర్కొంది. పొటాషియం కణాలు, శరీర ద్రవాలలో ఒక ముఖ్యమైన భాగంగా ఉండి, హ ృదయ స్పందన రేటును, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుందని తెలిపింది. ఈ పండ్లలో సమ ృద్ధిగా ఉండే ఐరన్, ఫాస్పరస్?లు రక్తకణ వ ృద్ధికి తోడ్పడటం ద్వారా రక్తహీనతనీ తగ్గిస్తాయి. ఆర్థరైటిస్ ఉన్నవారు ఈ పండ్లను తీసుకొంటే.. వీటిలోని కాల్షియం, ఫాస్పరస్ ఎముకలను ద ృఢంగా ఉంచుతాయని.. కీళ్లకు సంబంధించిన పలురకాల ఆరోగ్య సమస్యలకు ఈ పండు ఔషధంలా పనిచేస్తుందని అంటున్నారు. రేగు పండ్లలోని విటమిన్ సి , విటమిన్ కె, పొటాషియం వంటి పోషకాలు ఎముకలను బలపరుస్తాయని అధ్యయనం పేర్కొంది. రక్తప్రసరణ సజావుగా జరిగి ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు దరిచేరవు. కాలేయానికి సంబంధించిన సమస్యలకు దూరంగా ఉండొచ్చు.వీటిలోని పీచు జీరా?శయం పనితీరును మెరుగుపరిచి అజీర్తిని తగ్గిస్తుంది.గర్భిణులకెదురయ్యే వికారం, వాంతులు వంటి సమస్యలకు ఇది ఉపశమనాన్నిస్తుంది.మెనోపాజ్‌లోకి అడుగుపెట్టేటప్పుడు డి విటమిన్ తగ్గి ఎదురయ్యే సమస్యలకు ఈ పండుతో చెక్ పెట్టొచ్చు. నెలసరిలో అధికస్రావాన్ని ఈ పండు తీసుకోవడం ద్వారా తగ్గించొచ్చని చెబుతున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# పప్పుధాన్యాలతో డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందా? - అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే?

### - ఇవి రోజూ తింటే మంచిదంటున్న నిపుణులు! - పప్పుల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుందని సూచన

పెసర్లు, శనగలు, కందులు, బఠానీలు.. పప్పులు ఏవైనా సరే రుచిగానే ఉంటాయి. రుచిలో మాత్రమే కాకుండా, పోషకాల్లోనూ ముందుంటాయి. ప్రొటీన్ దండిగా ఉండే పప్పులతో కండ పుష్టి కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, డయాబెటిస్ నిర్వహణలో కూడా పప్పులు, త ృణధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు. శరీరానికి అవసరమైన ప్రొటీన్‌ను అందించడమే కాకుండా, వీటిలో పీచు పదార్థం పుష్కలంగా ఉంటుందని చెబుతున్నారు. శరీరంలోని కొవ్వును, కేలరీలను తగ్గించడంలో పీచు సహాయపడుతుందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఎలాంటి పప్పుధాన్యాలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం! శరీరంలో తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు లేదా ఉన్న ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా ఉపయోగించుకోలేనప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీన్నే షుగర్ జబ్బు అంటారు. ఇది పెరిగితే గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు మొదలు.. ద ృష్టి లోపం, ఊబకాయం వరకు ఎన్నో సమస్యలు చుట్టు ముడతాయి. పప్పుధాన్యాలు ఆహారంలో భాగం తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ త్వరగా కలవకుండా ఉంటుందని, తద్వారా షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయని తెలియజేస్తున్నారు. అలాగే, వీటిలో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు.

### డయాబెటిస్ పేషెంట్స్?కి కలిగే ప్రయోజనం :

భారతీయ ఆహారంలో పప్పులు ఒక ముఖ్యమైన భాగం. వీటిలో కార్బోహైడ్రేట్లు ఉన్నప్పటికీ, గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా పెంచవని అంటున్నారు నిపుణులు. వీటిలో ఉండే ప్రొటీన్, ఫైబర్ చక్కెర నిదానంగా విడుదలయ్యేలా చేస్తాయని, ఇది గ్లైసెమిక్ నియంత్రణకు మేలు చేస్తుందని చెబుతున్నారు. మాంసాహారం తీసుకోని వారికి ప్రొటీన్ లభించడానికి పప్పులు ఉత్తమ మార్గమని సూచిస్తున్నారు. పప్పుధాన్యాలలోని కార్బోహైడ్రేట్లు రక్తంలో గ్లూకోజ్‌గా మెల్లగా మారుతాయని అధ్యయనం పేర్కొంది. అందువల్ల గ్లూకోజ్ స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయని తెలిపింది.

### ఏ పప్పులు మేలు చేస్తాయి? :



ఈ రోజుల్లో అధిక బరువు, మధుమేహాన్ని అదుపు చేయడమే పెద్ద సవాలుగా మారింది. గ్లైసెమిక్ ఇండెక్స్ 55 కంటే తక్కువగా సూచించే ధాన్యాలను తీసుకుంటే బరువుతోపాటు డయాబెటిస్ కూడా అదుపులోకి వస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. పప్పుధాన్యాలు ఇన్సులిన్ నిరోధకత, టైప్ 2 డయాబెటిస్, సంబంధిత సమస్యలను నివారించగలవని అధ్యయనం పేర్కొంది.

### డయాబెటిస్ ఉన్నవారికి ఏ పప్పులు మేలు చేస్తాయి? :

శనగ పప్పు : దీని కేవలం 8 మాత్రమే. ఇందులో ప్రొటీన్లు, ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటాయంటున్నారు నిపుణులు. ఇవి కొత్త కణాల ఉత్పత్తికి సహాయపడతాయని తెలియజేస్తున్నారు. రాజ్మా : దీని 19. ఇవి చర్మం, కళ్ల ఆరోగ్యానికి మంచివని చెబుతున్నారు. ఇవి బీపీని నియంత్రణలో ఉంచడానికి కూడా సహాయపడతాయని పేర్కొంటున్నారు. పెసర పప్పు : ఇది అత్యంత ఆరోగ్యకరమైన పప్పులలో ఒకటి. గర్భిణులు, వ ృద్ధులు, ఎదుగుతున్న పిల్లలకు ఇది చాలా మంచిదంటున్నారు . ఇందులో ప్రొటీన్లు, ఐరన్, విటమిన్లు సమ ృద్ధిగా ఉంటాయని సూచిస్తున్నారు. శనగలు ఇవి రుచికరమైనవి. వీటిని స్నాక్స్‌గా కూడా తీసుకోవచ్చు. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ సేపు ఆకలి వేయకుండా చూస్తాయంటున్నారు. వీటి గ్లైసెమిక్ ఇండెక్స్ 42 ఉంటుందని అధ్యయనం పేర్కొంది.

### ఇవి కూడా :

బార్లీ : 25-30 మధ్యలో ఉంటుంది. పీచు పదార్థం అధికంగా ఉండటం వల్ల నెమ్మదిగా జీర?ం అవుతాయని నిపుణులు చెబుతున్నారు. గట్? హెల్త్?ని ఆరోగ్యంగా ఉంచుతూ అధిక బరువుని అదుపు చేస్తాయని చెబుతున్నారు. కొర్రలు : వీటిని ఆయుర్వేదంలో శ్రీధాన్యాలుగా పిలుస్తారు. కొర్రల్లో 30-35 మాత్రమే. టైప్ 2 డయాబెటిస్?ని అదుపు చేసేందుకు ఇవి చక్కగా దోహదపడతాయని పేర్కొంటున్నారు. ఫైబర్, ఐరన్?తో పాటు కాల్షియం అందిస్తాయని తెలియజేస్తున్నారు. బ్రౌన్ టాప్(అండు కొర్రలు) మిల్లెట్?లో గ్లైసెమిక్ 20 మాత్రమే. వీటిల్లో అనేక మైక్రోన్యూట్రియెంట్లు ఉంటాయని, నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయని తెలియజేస్తున్నారు. గుండెని ఆరోగ్యంగా ఉంచుతాయని పేర్కొంటున్నారు. సామలు : ఇవి అనేక పోషకాలను అందిస్తాయి. 50-52 మాత్రమే ఉండే గ్లూకోజ్ గ్రాహకాలను అదుపు చేస్తాయని చెబుతున్నారు. మెగ్నీషియం, ఐరన్, విటమిన్ బి వంటి వాటిని అందిస్తాయంటున్నారు. అంతేకాదు, జీర?క్రియను మెరుగ్గా ఉంచడంతో పాటు బరువుని తగ్గిస్తాయని వివరిస్తున్నారు. ఊదలు : 41-50 వరకూ ఉంటుంది. వీటిల్లో ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ ఉంటాయని చెబుతున్నారు. పూర్తి ఆరోగ్యాన్ని సమకూర్చడంతోపాటు మధుమేహాన్ని అదుపు చేస్తాయని తెలియజేస్తున్నారు. ఎమ్మెర్ గోధుమ (ఖప్లీ గోధుమ) : 40-45 సూచిస్తుంది. మధ్యాహ్నం భోజనానికి వీటితో చేసిన రొట్టెలను తీసుకుంటే బరువు, షుగర్ అదుపులో ఉంటుందని చెబుతున్నారు. ఇతర ధాన్యాల పిండితో కలిపి కూడా దీన్ని ఉపయోగించొచ్చని సలహా ఇస్తున్నారు. బక్వీట్ (కుట్టుగోధమ) :45-51. పీచు పదార్థం అధికంగా ఉంటుందట. రక్త ప్రసరణను వేగవంతం చేస్తాయని, నెమ్మదిగా జీర?మవుతాయని తెలియజేస్తున్నారు. మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అందుతాయని పేర్కొంటున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com